శ్రీరస్తు

బుద్ధచరిత్ర

యక్షగానము

(బుఱ్ఱకథ)

:గ్రంథకర్త:

సువర్ణ ఘంటాకంకణ బిరుదాంకిత
సంస్కృతాంధ్ర పండిత
మహాకవి బండ్ల సుబ్రహ్మణ్యము

విజయ దశమి.

ప్రథమ ముద్రణము,
వేయి ప్రతులు.

1972

For Copies:

Bandla Subrahmanyam,
PANDIT,
VETAPALEM, Chirala Taluka.
(Prakasam Dt.)

నా రచనల నాదరించి సాహిత్యసేవయందుల్లాసము గలిగించుచున్న
ఆంధ్రలోకమునకు నా కృతజ్ఞత.

— గ్రంథకర్త.

రు 2-00

సువర్ణఘంటాకంకణ, గండపెండేర, బిరుదాంకితులు,

బుఱ్ఱకథా పితామహ, యక్షగాన సమ్రాట్

శ్రీ శ్రీ శ్రీ నాజరు గారి అభిప్రాయము

శ్రీ శ్రీ శ్రీ సువర్ణఘంటా కంకణ బిరుదాంకితులు, సంస్కృతాంధ్ర పండితులు, శ్రీ బండ్ల సుబ్రహ్మణ్య మహాకవిగారికి శతాభివందనములు.

ఆర్యా!

తమరు పంపిన "బుద్ధ చరిత్ర - యక్షగానము" మన శిష్యుడు చిరంజీవి పేరిశెట్ల వేంకట సుబ్రహ్మణ్యము నాకందించినారు చదివితిని. మీ కవిత, మృదుమధుర గంభీరమై, అనర్గళముగ సాగినది. పాఠకుల కింతటి సరళశైలి అందించిన రచయితలీనాడు అరుదు. అట్టి కాలములో ఇట్టి కవితనల్లిన తమరు ప్రశంసనీయులు. ఈ కవిత మీ బిరుదుకు తగిన రీతిలోనున్నది. వీరరస ప్రధానము, ప్రబోధాత్మకమైన యక్షగానము కూడ మీ కలమునుండి వెలువడిన, సువర్ణమునకు పరిమళ మబ్బినట్లుండునని నాభావన. అందులకై తమరు ప్రయత్నింపగలరని నాయాశ. అట్లు వెల్వడిన రచన, ఒక దేశమున కేగాక, యావత్ప్రపంచ, కార్మిక, కర్షక, కూలి, నాలి, జనాళికి సైతముపయోగపడి శాశ్వతకీర్తి పొందగలదని నాయభిప్రాయము. ఫణితిలో పండితకోవంగా ప్రతిబింబించుచున్నది. (భాషలో, భావనలో క్రొత్తదనము చూడలేక పోతిని) మీరు పాటించినవన్నియు చాల న్యాయముగ నున్నవి. నేను తమరిని కోరునదేమన "యక్షగానమనగా - నాట్యము." నాట్యమనగా - "నాట్యం తన్నాటకే ష్వేకయోగ్యం పూర్వకథాయుతం" అని మీరెరుగనిది కాదు దీనిలో "ఇతి వృత్తం త్రైలోక్యస్యాస్య సర్వస్య భావానుకీర్తనం, నానాభావోపసంపన్నం, నానావ్యవస్థాంతరాత్మకం, లోకవృత్తానుకరణం నాట్యం"

నిన్న, నేడు, రేపటి, నీ, నా, భావసంపదలతో మనసులో నిండిన సమాజవ్యక్తుల అనగా - లోకుల అనగా - ప్రజల నిత్యజీవితాభి

వృద్ధి క్రియానుగతాల నెఱుకపఱచేదిగా ఉండాలని. మనప్రాచీనులు శాసించారనే శ్లోకమే రుజువని తమలాంటి ప్రముఖులకు, పండితులకు నేనేరే చెప్పనవసరంలేదు కదా?

సాహిత్యమునకన్న సమాజదృష్టి నాకు మిన్న. కావున యక్షగానము దాని రూపముమీద నాకున్న, నేను తెలిసికొన్న ఈచిన్న భావన లిందు కెతించినాను. న శాస్త్ర దృష్టి, సమాజపరమైనది తప్పులున్న క్షమింప ప్రార్థన.

కళాభివందనములతో,

కోటిపాడు,
29-7-1972.

భవదీయుడు,
నాజర్.

విజ్ఞప్తి

ప్రపంచమున మొట్టమొదట నహింసా సిద్ధాంతమును మాఱుమ్రోగించిన మహా ప్రవక్తయగు బుద్ధుని చరిత్రయిది- ఇది యీ నాటి రచన కాదు దీని వయస్సు సుమారిరువది సంవత్సరములు. నాడిది పలుబడి నియమములలోం జెప్పబడిన కథ. కావుటంజేసి రేడియో గాయకులగు జి. వెంకటశివయ్యగారు కథకులుగా విజయవాడ రేడియో కేంద్రమువారచ్చట దీనిం బ్రసార మొనర్చిరి.

అంతేందని సనకాలక్రమమునం బెంచియింతచేసితి. నా యీరచన నత్యంత ప్రశాంత స్వాంతంబునం జదివి యమూల్యాభిప్రాయ మొసంగిన యక్షగాన కళానిధి నాజరు గారికి నాహృదయపూర్వక నమస్సులు-

గేయరచనా సమయమునం దనకుందోచిన సలహాల నొసంగుచు నాకుం దోడ్పడిన మత్ప్రియాంతేవాసియగు చిరంజీవి పోనిసెట్టి వెంకట సుబ్రహ్మణ్యమున కస్మచ్ఛుభాశీస్సులు.

గ్రంథకర్త.



అస్మత్పితృపాదులు

బండ్ల వేంకటసుబ్బయ్యగారు

— గ్రంథకర్త.



గ్రంథకర్త.

శ్రీరస్తు

బుద్ధచరిత్ర

యక్షగానము

(బుఱ్ఱకథ)

శ్రీతన్నైజస్వలరారు తేజునధరి త్రిభృత్సుతారాధ్యుఁడై
జోలంబాడెడి మా యువీడి సుఖియై శుద్ధోదనానందుఁడై
మేలుంగూర్చు యశోధరుండయి వనిన్ మీనాంకబాణాహతిన్
శిలమ్మోదని మారజిన్నిజతపశ్శ్రీ మిమ్ము రక్షించుతన్.

గణాధిప ప్రార్థనము

రాగము- హంసధ్వని- ఆదితాళము

ప్రమథాధిపా- బుధవిదితకృపా- ప్రమథాధిపా
ఫణిసూత్రధారీ- భక్తాఘహారీ
భక్తితో నినుఁగోర దేవనాదు
వాంఛలీయరార- పరసురమందార ॥ప్రమ॥
పార్వతీసుతా- సజ్జనావనవ్రత
సూరెహాద్రీనుత- సుబ్రహ్మణ్యనుత ॥ప్రమ॥

పార్వతీదేవి ప్రార్థన

సరస్వతి రాగము- చతురస్రజాతి- త్రిపుటతాళము

దయనను బ్రోవవమ్మా భవానీ
శూలపాణి- రాణి- మృదువాణి- దాక్షాయణి ॥దయ॥
అతినిగూఢ జ్ఞానప్రదాయిని- హైమవతీ
తల్లీ నిరతభక్తకల్పవల్లీ
జయమిడవే వేడుకతో నాకిఁక
పరమగుణపావని- బండ్ల సుబ్రహ్మణ్యకవి రక్షణి ॥దయ॥

ఈశ్వర ప్రార్థనము

బేగడ రాగము- చతురస్రజాతి త్రిపుటతాళము

వరధీర దయఁజూడరా- మహేశ్వరా
నన్నావఁదడవేలరా- దేవదేవ గౌరీ ॥వర॥
అఘములను హరియింపవా- ఆనందభావ
అతిప్రేమ నన్నేలవా- భక్తావన పావన
దరిలేని మాయామ- హాంధకారమునుండి
రక్షించువాఁడ వీవే- దేవ దివ్యప్రభావ
విజయానంద నిర్గుణవిలాస- విధిసురపూజిత చరణసారస
సదయా దుర్గాధిప విమలవిభవ-నమగనవ-స్తుతివినవ- శివ-అభవ
॥వర॥

సరస్వతి ప్రార్థన

కం॥ వాణీ! హిరణ్యగర్భుని
రాణీ! రమణీయగాన రాజిత వీణా
పాణీ! మదయుత బంభర
వేణీ! నానాల్క నిందు వేడ్కన్ నిలుమా.

విష్ణు ప్రార్థన

— రగడ —

శ్రీరమణీమణిచిత్తవిహారా - శ్రితజనమందారా
సారాచారా కౌస్తుభహారా - సజ్జననుత ధీరా
దానవ భంజన ధార్మికరంజన - దాసావనకృష్ణా
మాననీయగుణజాలా నిస్తుల - మదకరీంద్రపాలా
నీపదరాజీవంబులఁగొల్తుము - నిచ్చలు కడుభక్తి
పాపదూరులనుజేసి మాకునిడు - పావనమగుముక్తి

ఆశీస్సు

— రగడ —

నిరతము సుబ్రహ్మణ్యుని బ్రోచుచు - నిందు మహిమ వెలుఁగు
కరుణాకరుఁడయి భక్తవర్యులను - గాచుచుఁడాఁజెలఁగు
వాసిన్ రావూరిపేటపురంబున - వరలుచుండు శివుఁడు
కాశీవిశ్వేశుండీప్రజలను - గాచుఁగాత భవుఁడు

భరతమాత

సీ॥ ఈశ్వర దత్తమౌ హిమగిరి ముత్యాల
డంబుమీఱిన కిరీటంబనంగ
వివిధ ధాతు విభూతి విలసిల్లు వింధ్యాద్రి
రాజరత్నాల యొడ్డాణమనఁగఁ
బ్రాక్పశ్చిమాబ్ధులఁ బ్రభవించు కెరటాలు
రహివీచు వింజామరంబు లనఁగ
సింహళద్వీపము సింహాసనము చెంత
బ్రియముగొల్పెడి పాదపీఠమనఁగ

తే॥ సకల దివ్యర్షిబృందము సంతసమున
మహిమ నుతియింపఁగల వందిమాగధులన
నెగడు నిర్మలవిఖ్యాత నిత్యపూత
పరమగుణగణసముపేత భరతమాత.

సంస్కృత కవుల స్తుతి

ఆ॥ వె॥ పరమ భక్తిఁగొలుతుఁ - బ్రాచేతసుని వ్యాసు
భాసు దండి కాళి-దాసు భోజు
బాణు హర్షు మాఘు - భవభూతి భారవి
దేవవాణి రసనఁ - దేజరిలఁగ

ఆంధ్ర కవి స్తుతి

సీ॥ నన్నయోత్పలమాల చెన్నుమీరుచునుండు
తిక్కన కందంబు తీపి మెండు
ఎఱ్ఱనార్యుని గీతమెంతొ రమ్యత నొల్కు
శ్రీనాథు సీసంబు చెలువుఁ గుల్కు
సోమనాథు ద్విపద సొగసుగా నడయాడు
పెద్దన మత్తేభ మొద్దికఁదగు
రాయలపల్కులో రాళ్ళు రాపాడును
మూర్తి శార్దూలంబు బొబ్బరించు
రఘునాథు నడకలో రాచఠీవి వెలుంగు
నన్నెచోడు పదాల తెన్ను వేఱు
వేమనతో నాల వెలది నృత్యముసేయుఁ
బోతన యన్నింటఁ బోతపాయుఁ

తే॥ జేమకూరన్న పాకానఁ జిందు రసము
సూరనార్యుని కల్పనాశుద్ధి ఘనము
గజ్జెగట్టిన జెట్టులు గాన వీర
లందఱకు నొక్క వందన మాచరింతు.

(ప్రార్థనానంతరము వంతెవారలలో నొకరు)

వంత:- ఓ యక్షగాన విశారదా! నేఁడేకథాసుధారసమ్మున ఈ మహాజనుల సంతోషపెట్టఁదలఁచితివి?

కథకుఁడు:- ఏమహనీయుఁడు క్రీస్తుకంటె మహమ్మదుకంటె కొన్ని వందల సంవత్సరములు ముందె ఈభారతదేశమున జన్మించి నవమోహనాంగియగు భార్యను ముద్దులబిడ్డను రాజ్యరత్న సింహాసనమునుద్యజించిఘోరతపస్సుచేసిజగద్గురువై అహింసా పరమో ధర్మః మహాత్మా సర్వభూతాత్మా- అనుధర్మమ ములప్రాశస్త్యము ప్రవచించి యనుష్ఠించి యనుష్ఠింపఁజేసెనో విశాంతిదాత గాంధీమహాత్మునకాదర్శపురుషుఁడో, ఏవిశ్వ

శ్రీయోఁకృత ధర్మచక్ర మవక్రమై యావద్భారతమునఁ బ్రకాశించుచున్నదో యట్టి బుద్ధభగవానుని దివ్యకథ వినిపింపఁ దలఁచితి.

వింత:- బుద్ధదేవుని చిత్రములు బొమ్మలు నిత్య మెల్లయెడలఁగనఁ బడుచుండునుగాని యాపుణ్యపురుషుని జీవితచరిత సమగ్రముగ నాకును దెలియదు. అదివినుభాగ్యము నేఁడుగలుగు చున్నందులకు సంతసించుచున్నాఁడ.

కథ:- మంచిది. విను.

— రగడ —

ఆనందంబుగ బుద్ధచరిత్రము- అయ్యలార వినుఁడీ
మానసమందున యోచనచేసి- మంచిదారికనుఁడీ
ప్రజలమేలునకు రాజ్యము విడిచిన-ప్రజా సేవకుండు
విజనాటవులందవన్నుసేసిన- విశ్వదాత యతఁడు

సిద్ధార్థుని జననము

(కథాప్రారంభము) (మరాటీ వరుస)

శ్రీరంజిల్లెడి భారతమాతకు- శిరోభూషణంబు
సారాచార విచార ధీరులకు- సహజపోషణంబు
సోమసూర్యమణి సౌధరాజముల- సొంపుల నింపొందు
రామరాజ్యమన శాక్యులరాజ్యము- రాజిల్లఁగనందు
కలదు రోహిణీనదీతీరమునఁ- గపిలవస్తు పురము
కలకాలంబును భోగభాగ్యములఁ. గలకలలాడుచును
ఆపురమేలెడి రాజుశౌర్యమున- అమరవరుల మించె
చాపహస్తుఁడై యుద్ధరంగమున- శత్రుల నోడించె.
శుద్ధచరిత్రుఁడు శుద్ధోదనుఁడు- సూర్యవంశజుండు
పద్ధతి మీఱక ప్రజలహాయిగాఁ- బాలించుచుండు
అతని కిద్దఱు భార్యలుండిరి- అనుపమగుణవతులు
నీతిని దప్పని శాంతమానసలు- నిత్యసత్యవ్రతలు
మాయాదేవి గౌతమి యనెడి- మానవతులు సతులు
ఛాయాదేవి దినమణి నట్టుల-చక్క ననుసరింత్రు
చాలకాలమటు లాఁపురముండఁగ- సంతానము లేక

ఏలరాజ్యమని చింతలు పొందుచు- ఇంతులతోఁగూడి
దేవతార్చనలు తీర్థయాత్రిలు ను- చిరముగఁజేయుచును
సావకాశముగఁ జెట్టుకు పుట్టకు- సల్పిరి పూజలను

వ॥ ఇట్లు సంతానముకొఱకు భగవంతుని ధ్యానించుచుండ, ఒక దినమున మాయాదేవి నిద్రించుచుండ కలలో-

జరజర వచ్చెను- దేవవిమానము (తందాన)
చరచర దిగిరట- దేవకన్యలు
మాయాదేవిని- ఆవిమానమున
హాయిగఁ జేర్చిరి- దేవకాంతలు
ఎగిరిపోయి ఆ- దేవవిమానము
దిగినది చల్లఁగ- గంగయొడ్డునకు
గంగాజలముల- జలకమార్చిరి
బంగరుతీఁగల- బట్టకట్టిరి
మణిపీఠమ్మున- కూర్చుండఁగా
మణిహారమ్ములు- వేయుచుండఁగా
కోమలమూర్తి- నిండుచంద్రుఁడు
ఆమెగర్భమున- ప్రవేశించెను
కొక్కొరోకోయని- కోడికూసెను
దిక్కులుతెలతెల- తెల్లవారెను
కలవరపడుచు- లేచినాథునకు
కలలోజరిగిన- దంతయుఁజెప్పె

వ॥ అట్లు సెప్పఁగా శుద్ధోదనుఁడు విని జ్యోతిశ్శాస్త్రజ్ఞుల పిలిపించి మాయాదేవికి వచ్చిన స్వప్నమును తెలుప వారది సంతాన ఫలసూచకమని విన్నవించిరి. అంతఁగొంతకాలమునకు ఆ యమ్మ గర్భమును ధరించి ప్రసవించుటకు దేవదహానమునం గల పుట్టినింటికి వెళ్ళుచుండ మధ్యేమార్గమున లుంబినీవనములో ఒక శుభముహూర్తమునఁ బ్రసవించినంత.

— రగడ —

చూడంజక్కని ముద్దుల బాలుఁడు- సుతుఁడొకఁడుదయించె
వేడుకతోడను వృక్షలతాదులు- విరుల వాన నించె

జలజల పొంగెను నదుల జలంబులు- సంతోషముమించె
కలకల కూసెడి పక్షిజాలముల- గానము రాణించె
నవ్వుముఖంబుల దాసీసంఘము- నాట్యమాడఁగాంచె
అవ్వ యొకర్తుక యప్పటిపనులకు- అజ్ఞల నిప్పించె
తగినటు బిడ్డను దివ్యజలంబుల- తానంబాడించె
అగరుగంధముల సాంబ్రాణిపొగ- హాయిగ వేయించె

జోలపాట

రాగము- మధ్యమావతి

వేదవేదాంగాది- విజ్ఞానదీపా
ఆదినాగకలాప- ఆచలేంద్రచాపా ॥లాలీ॥
సనకాదిఋషులెల్ల- సన్నిధింజేర
ఘనమైనవేదాంత- గతిఁజూపు ధీరా ॥లాలీ॥
దక్షిణామూర్తివై- తమమణఁచుజ్ఞానీ
ఆక్షిణమగుతేజ- మందిచ్చుమౌని ॥లాలీ॥
పరమార్థచింతతోఁ- బ్రార్థింతు నీశా
వరదయాదృష్టితో- వరలు పరమేశా ॥లాలీ॥

వ॥ అని జోలపాడె, అంతఁగొంత విశ్రాంతిననుభవించి,

— రగడ —

తల్లిబిడ్డలను బంగరుపల్లకి- తగినటు చేర్పించె
మెల్లఁగ నింటికిఁ జేర్చి రాజునకు- మేలది వినిపించె.

వ॥ అవ్వార్త విని మహారాజు సంతోషసాగరమున నోలలాడుచు-

— రగడ —

వాడవాడల పండువు సేయఁగ- వార్తలఁ బంపించె
పొడిమి మీఱఁగ అన్నదానముల- పూర్తిగఁజేయించె
వేనవేలుగా వచ్చిన జనముల- వేడ్కలు కనిపెట్టి
పానకంబు వడపప్పు చక్కెరయు- పండ్లు పంచిపెట్టె
అసితుండనియెడు మహర్షియొక్కం- డచ్చటి కేతెంచె
పసిబిడ్డంగని దివ్యచిహ్నముల- బాగుగఁబరికించె
కానీ మాయాదేవినిగాంచి- కంటనీరు గార్చె
మహానుభావుఁడు కొడుకైపుట్టెను- మహారాజ యనియె

మహాత్ముఁడాఋషి తపస్సుచేయఁగ- మరల గుహకుఁజనియె.
ఆఱుదినమ్ములు గడచిపోయెను- ఆనందముతోడ
మాఱుమ్రోగెను దానధర్మముల- మహారాజు మేడ
ఏడవదినమున మాయాదేవికి- ఎసఁగి జ్వరము కాచె
పాడుజ్వరంబది చివరకు ఆయమ- ప్రాణములను దీసె
కాఱుమేఘములు గమ్మినరీతిగఁ- గాంతలు గుమిగూడి
బోరున నేడ్చిరి ఆమహిళామణి- పుణ్యము కొనియాడి
కొండలరాయని గుండెలుగరఁగెను- ఘోషించెను గడలి
దండివీరులు కన్నీరుగార్చిరి- ధైర్యమ్ములు సడలి
కష్టసుఖంబులు కావడికుండలు- గాజగాన నుండె
నష్టభార్యుఁడై రాజుదుఃఖమున- నవసి కుందుచుండె
తల్లిపాలకు బిడ్డనోటికి- దైవఁబెడఁబాపె
చెల్లెలు గౌతమి కన్నివిధంబుల- చింతలు తలమోపె
శుద్ధోదనునకు దిక్కులన్నియును- శూన్యముగాఁదోఁచె
బుద్ధిమంతుడగు మంత్రి యాతని- బుద్ధి శాంతపఱచె
అంతట రాజు బుధులను బిలిచి- ఆకుమారు డాసి
సంతసమందఁగ వారికి గొప్పగ- సన్మానముచేసి
సిద్ధపురుషులకు నుండెడిగొప్ప- చిన్నెలన్నిగాంచి
సిద్ధార్థుండను నామకరణమును- జెలువుగఁజేయించె
తల్లిలేని యాపిల్లవాని పిన- తల్లి పెంచుచుండె
తల్లిదండ్రులకుఁబెన్నిధివోలెను- తనయుఁడు తానుండె

వ॥ ఆబాలుఁడు శుక్లపక్షచంద్రునివలె దినదినాభివృద్ధిగాంచుచుండ

— రగడ —

విశ్వామిత్రునియొద్ద బాలునకు- విద్యలు నేర్పించె
విశ్వరక్షణకు ధనుర్వేదమును- వేదము గఱపించె
పదియునెనిమిది వత్సరంబుల- ప్రాయముచనుదెంచె
ముదమునఁగళలందేలియాడుచును- ముద్దులుకురిపించె

హంస రక్షణము

వ॥ అంత నొకనాఁడు సూర్యోదయ సమయమున ప్రాతఃకాల వ్యాయామవిహారమునకై గుణదత్తుఁడను ప్రాణస్నేహితుఁడును తానును గుఱ్ఱముల నెక్కిరి. గుణదత్తుఁడు గుఱ్ఱమును విడిచిన వెంటనే సిద్ధార్థుఁడు వైరిజనకంటకమగు తన కంటకమును బిగువ మీఁదదుమ్కె.

కళ్ళెము లాగి విడువఁగా .... పై
గల్లున గజ్జెలు మ్రోఁగఁగా
ఉల్లాసమ్మున సాగఁగా
పెల్లుగ ధూళులు రేగఁగా
రాజమార్గముల నేగుచు
రాజుల దృక్కులఁదోఁగుచు
ప్రక్క గుఱ్ఱమును మించఁగా
ఒక్క పర్వునను పాఱఁగా
సెలయేఱులపై దూఁకుచు
మలమెట్టుల కెగఁబ్రాకుచు
పచ్చిక బయళ్ళఁబాఱుచు
పచ్చని పొదలం జేరుచు
ఉఱిమెడు మబ్బుల మెఱుపుగా
నురుగులు గ్రక్కుచుఁబోవగా
హిమగిరి వనముల్కి చేరఁగా
క్రమమున నాఁపెను మెల్లగా ....

వ॥ అంత మిత్రు లిర్వురు గుఱ్ఱములు దిగి పాఱుచున్న సెలయేళ్ళను పరుగెత్తుచున్న లేళ్ళను, కూయుచున్న పక్షులను, కాయుచున్న వృక్షములనుచూచుచు రోహిణీ నదీతీరమున విహరించుచుండిరి. అప్పుడ దేవదత్తుడను క్షత్రియ బాలుఁడు సహచరులతో వేఁట కొఱకు బయలుదేఱుచున్నాఁడు. ఎట్లన -

— గేయము —

నల్లని తలగుడ్డసుట్టి

తెల్లని చల్లడముదొడ్గి
గజ్జెల గుడిగిని గట్టి
పచ్చని పెనుదట్టిసుట్టి
పచ్చల పిడిబాకుదోపి
పెద్దవింటిని జేతఁబట్టి
చక్కని పెన్నిమువేసి
ఎఱ్ఱని గుఱ్ఱంబునెక్కి
జిఱ్ఱునఁ గళ్ళెంబులాగి
వేగఁగదలెను దేవదత్తుఁడు- నారాయణా।
సాగుఁడీ సాగుఁడీయన్నాఁడు- నారాయణా॥
నెట్టనఁ జిట్టడవిమెట్టి
బిట్టు పెడబొబ్బలను బెట్టఁగఁ
గ్రేళ్ళువాఱెను లేళ్ళగుంపులు
గుఱ్ఱుగుఱ్ఱని కిరులు దిరిగెను
కాండ్రు కాండ్రని పులులుపర్విడె
వేఁటలాడెను దేవదత్తుఁడు- నారాయణా।
తరిమితరిమి వానిఁగొట్టెను- నారాయణా॥

వ॥ ఇట్లతఁడు వేఁటలాడుచు యువరాజున్న ప్రాంతమునకు వచ్చెను. ఆ త్తఱి ఆకాశమార్గమున ముత్యాలవరుసలవలె, నక్షత్రతోరణాములరీతి తెల్లతామరపూలచాళ్ళనా రాజహంసలు బారులుదీరి వచ్చుచుండె. ఆ హంసలలో నొకదానిని దేవదత్తుఁడు బాణముతోఁ గొట్ట అది విలవిలఁ దన్నుకొనుచు సిద్ధార్థుని కాళ్ళముందు పడ అతఁడు దానినిలేవనెత్తి మెల్లఁగా బాణముపెరికి కాఱుచున్న నెత్తురు తుడుచుచు కన్నీరువిడుచుచు అక్షీణప్రేమమ్మున దానిని రక్షింపఁదలంచి.

ఉ॥ ఎక్కడ జన్మభూమి? సతియెవ్వతె? బంధువులెవ్వ? రేటికి
దిక్కున కేగుచుంటి? తతిపక్షులు జూపుమి యుత్తరంబులా
ముక్కున కెంపుడాలు తలముందట గోరువవన్నెలీను నీ
చక్కని మేను క్రూరనరశాతశరాహతమయ్యెనక్కటా!

వ॥ అని పక్షిని ఓదార్చుచుండ –

ఉ॥ ఎవ్వఁడవీవు క్రొవ్వడర ఇవ్వనిఁజొచ్చితె మచ్చరాహతిన్
దవ్వులనుండి తూలి యిటు దాపుగఁజేరిన నండజంబు నీ
వెవ్విధిఁబట్టికొంటి? తగవే పెఱవారల సొత్తుదాక ఈ
మవ్వపుహంసమాంసరతి మానుము జీవితవాంఛయున్నచో

వ॥ అని సగర్వముగాఁబలుకుచు సమీపించిన దేవదత్తుని మాటలువిని
సిద్ధార్థుఁడుపక్షివంక కరుణాన్వితదృష్టి ప్రసరించి వానితోనిట్లను

ఉ॥ తామరతూడులందినుచు దప్పికి గ్రుక్కెఁడు నీళ్ళు గ్రోలుచున్
వ్యోమవిహారమున్ సలుపు- చొక్కనికే నపకారిగాక లో
నానునుమాటెఱుంగక హిమాచలమానసవాసియైన యీ
కొములరాజహంస పడఁగొట్టఁగ జేయెటు లాడెఁజెప్పుమా

వ॥ దానికి దేవదత్తుఁడు వికటముగ నవ్వి–

— రగడ —

క్షత్రయవరులకు వేఁటలాడుటయె- శాస్త్రసమ్మతమ్ము
పాత్రమెఱుఁగక మాటలాడెదవు- బాగుబాగు పొమ్ము
అహింస యెవరికి బోధించెదవది- అందరాని సొమ్ము
సహింపఁజాలను నీమాటలనిఁకఁ- జాలుఁజాలు తెమ్ము

వ॥ అనవిని అమృతమొలుకు చంద్రబింబములో రాహువుతనవిసపుగోర
గుచ్చినట్లు బాణముదీసి మేనిలో నాటితివి. ఇదినన్ను శరణుసొచ్చినది;

— రగడ —

అభయమిచ్చితిని పక్షినివిడుచుట- అన్యాయమునుమ్ము
శుభముగ నీకొకవిందు సేసెదను- సోదర యిటురమ్ము
అని సిద్ధార్థుఁడుపల్క దేవదత్తుఁడు సక్రోధుఁడై

రాగము – జంఝూటి- దరువు

ఏలరా- తేఁడా- విడరా- యేరా- కూరిరా।
చాలుచాలు-నాఁగుమాఁగు- మించుకైన భీతిలేక
ఖగరాజముఁగొనఁ బోడియా- గాసిల్లఁగ జూడఁదగ ॥ఏలరా॥
అలకింపు నామాటల- అజ్ఞానంబు వీడుమింత
నేను గొట్టిపట్టిపెట్టి- నెట్టు నీవు తీసికొందు ॥ఏలరా॥
సంగతిని దెలిసికొనక- భంగమిపుపొందగను

ప్రాంగుట తగదంటి నంత- రంగమును మార్చుకొను ॥మేలరా॥

వ॥ అనుడు సిద్ధార్థుడు దేవదత్తా ఈబాణము నీ శరీరమున గుచ్చు కొనుము. ఎంత బాధగలిగించునో నీకే తెలియంగలదు. ఐననీ వేల ఖడ్గము ధరించితందువా? అది సాధుసంరక్షణార్థము అని యను చుండ దుష్టశిక్షణకొఱకు. ఇంకందీంగల ంగినపొదకదలును.

—రగడ—

శరణనరక్షణచేసెడివారే- సత్యధర్మపరులు
కరుణలేకహింసించెడివారే- కాలునిసహచరులు
గయునిరక్షణకుఅర్జునుండేతన- గాండీవముపట్టె
గయనిభుండగుశిబిపక్షినిబోవంగ- కండలొలిచిపెట్టె
కావునంబక్షినిరక్షించుటయే- కాంగలకార్యంబు
నీవింకమాటలందూలనాడకుము- నిలుపుముశౌర్యంబు

తే॥ గీ॥ బాలు రువ్వెడు వానిపైంబూలు రువ్వి
శాంతి భద్రత లందుటే సముచితమని
పామలకుంబాలు పోయు నీభరతభూమి
హంసలను గొంతుకోయువాండవతరించె

వ॥ అన దేవదత్తుండాగ్రహోద్రగుండై

—రగడ—

సూర్యవంశజుల పరాక్రమము చవి- చూడదలంచితేని
ఆర్యధర్మముల ననుసరించి మా- టాడ కీయండేని
పక్షికి బదులుగ నీదుప్రాణములె- బలియగుననుకొనుము
పక్షపాతముగ మాటాడెదె నీ- బాణమందుకొనుము.

వ॥ అనుచుండ అతనిముఖమున

రోసము గొప్పగం దోంచెను ...సై...
మీసముం ద్రిప్పుచు చూచెను
కంటనిప్పుకలు గ్రక్కుచు
కంటునం జిందులు ద్రొక్కుచు
చీల్చెద వక్షము రెండుగా
తాల్చెద పేగ్వులు మెండుగా
రారా రమ్మని పిల్చెను
వీరావేశము తాల్చెను

అంతట ఆగుణ దత్తుఁడు
పంతము మీఱిన చిత్తుఁడు
సింహగర్జనము సల్పఁగా
సంప్రతికొఱ కుసికొల్పఁగా
ఇరువురు కత్తులు దూసిరి
గిరగిరఁ ద్రిప్పఁచు డాసిరి.
ముద్దుల రాజకుమారుఁడు
ఇద్దఱి నడుమన చేరెను ...

వ॥ చేరి గుణదత్తునిజూచి మిత్రమా! పక్షిని రక్షింపదలఁచి ఖడ్గయుద్ధమునకు సిద్ధపడుట ముల్లుదీసి ఆ గాయములో దబ్బనము గ్రుచ్చుట. నామాట విని నీకత్తి నొఱలో వేయుమనె. ఇంతలో ఈ వార్తదెలిసి శుద్ధోదనమహారాజు మంత్రితో అచ్చటికివచ్చె. రాజకుమారుఁడు తండ్రికి నమస్కరించె రాజానుజూచి దేవదత్తుఁడు తనకత్తి నొఱలోవేసికొని తాను గొట్టిన హంసను సిద్ధార్థుఁడు తీసికొనెననియు మీరుచెప్పి యిప్పింపుఁడనియుఁగోర అప్పుడతఁడు కొడుకును గని.

— రగడ —

ఇతరులసొమ్మును విసమువొలెనీ- వేలచూడవన్న
మతిలోనైదను ధర్మము దప్పిన- మర్యాదలు సున్న
ఈతఁడు కొట్టినహంసను నీవిపు- డేల తీసికొంటి
తాతల తండ్రుల వంశంబునకే- తగనిమాట వింటి.

వ॥ అన సిద్ధార్థుఁడు వినయమున ఇట్లనె.

— రగడ —

పాతకమంచును నెంచక ఈతఁడు- పక్షినిబడఁగొట్టె
వాతాహతిచేవచ్చి యిద్దినా- పాదములనుముట్టె
కొట్టినవెంటనె పిట్ట చావఁదా- గోరుట ధర్మమ్మొ
అట్టుగాక యిదిశరణుసొచ్చినది- అతని యాశవమ్మొ
అభయమిచ్చితిని రక్షణసేయఁగ- అప్పుఁడు వినుచుండ
ప్రభువులకియ్యది ధర్మమార్గమని- పలువురనుచునుండ

వ॥ ఇట్లతఁడు బదులు సెప్ప.

— రగడ —

వయ్యనసేమియుఁ దోఁపకజనపతి- సచివాగ్రణిఁగనియె
తియ్యనిమాటల న్యాయముతప్పక- తీర్పుచెప్పమనియె
ఘటనాఘటన సమర్థత గల్గిన- ఘనుఁడుమంత్రివరుఁడు
దిటవుగ రాజ్యము నడిపింపంగల- ధీరుఁడు పావనుఁడు
ఆలోచించెను మంత్రిపుంగవుఁడు- హంసవిషయమంత
తాలిమితో బహుధర్మ సూక్ష్మములు- తనకుఁదెలిసినంత
కొట్టినహంసను వేఁటకాఁడుతాఁ-గోరుటసత్యమ్ము
పట్టినపత్తినయ వీడుమంటయును-బాడిగాదుసుమ్ము
పాలును నీరును వేఱుసేయఁగల-పక్షియిద్దిరాజా!
తేలును ధర్మము హంసరాజమును-దింపుముయువరాజా!

వ॥ అవి ఆంచనుదింపించి "మీరిద్దఱు పక్షికొఱకుచేతులు చాపుఁడు ఎవరిచేతులలోనికి ఆపక్షివచ్చునో వారిదే యిది." అనిమంత్రి గారన నిర్వురు సమ్మతించిరి. దేవదత్తుఁడు ముందు చేతులు చాచెనుఅదిభయపడి వెనుకకదుగిడెను. గౌతముఁడు చేతులుచాప పూర్వస్నేహమున నడచివచ్చి ఆతని కరములంజేరెను. అంత

— రగడ —

ధర్మమెజయమని గుణదత్తుఁడంట- ధైర్యముతోఁ బలికె
నిర్మలహృదయముతో వనదేవత- నిండారఁగఁగులికె
పకపకనవ్వెను కొండజాతి ప్రజ- పరికించుచునుండ
ప్రకటితమయ్యెను దైవశక్తి ఆ- పక్షిబుదినుండి
దేవదత్తుఁడది పరాభవమ్మని- తిరముగ మదినమ్మె
కావరమంతయుఁ గోపరూపమున- కన్నుల నెగఁజిమ్మె
సమయముచిక్కిన నపకారంబును- సలుపఁ దలఁచుచుండె
కుమతియెట్టులే దుష్ప్రచారమును- గూర్పఁబొంచియుండె

వ॥ అంత రాజాజ్ఞచే ఎవరియిండ్లకు వారేగిరి. పిమ్మట ఒకదినమున శుద్ధోనుఁడు మంత్రినిజూచి "ఆర్యా! సిద్ధార్థుఁడు

— లలితకళా వినోదము — – రగడ –

ఎప్పుడు ఏదోవిచారమున జగ- మెఱుక మానినాఁడు
తప్పక సంతోషంబును గూర్చెడి- దారిచూడుఁనేఁడు

క్షాత్రధర్మమున కనువగు మార్గము- సాధింపఁగలేఁడా
గోత్రఖ్యాతిని వృద్ధిసేయఁగల- కోవిదుండు కాఁడా

వ॥ అనిచర్చించి రోహిణీతీరమున నందనోద్యానమువంటి వనములో ఎండ చలి వానల బాధలు తెలియకుండునట్లు ఇంద్రభవనము వంటిభవనములు మూఁడుకట్టించి చెన్నునిసారథిగనిచ్చి బాహ్య ప్రపంచము గోచరము కాకుండునట్లు సిద్ధార్థునందుంచె. అచట

— రగడ —

బృందావనమును ధిక్కరింపఁగల- ఎలదోఁటలపూలు
బృందారకులకె వింతగొల్పఁగల- ఎంతోతావిఁగ్రాలు
జలయంత్రమ్ములు తామరచెఱువులు- జలపక్షులు మెండు
చిలుకల హంసల నెమిళ్ళతోడనుఁ చెన్నుమీఱుచుండు
చిత్తరువులు బహురత్నతోరణాల్- సింగారముతొలుకు
అత్తరు పన్నీరిచ్చెడివాసన- ఆనందము చిలుకు
హంసతూలికా తల్పంబులతో- అలరారుచునుండు
హింసాకరమగు దృశ్యంబేదియు- ఎఱుకపడకయుండు

వ॥ అప్పుడు మహామంత్రి

— రగడ —

అందగత్తెలగు ఆటకత్తెలను- అచటికి రప్పించు
నందముగా నటమూఁడు పూటలును- నాట్యము సేయించు

వ॥ పుష్పబాణుని కొంగొత్తపూవులమ్ములోయన నొప్పునాపూఁబోడులు వాల్లీసకాదినృత్యము లొనర్చుచుండఁ జూపఱకు స్వర్గమున దేవేంద్రసభలో రంభ,ఊర్వశి,మేనక,ఘృతాచి, తిలోత్తమాదులు నాట్యము సేయు చున్నట్లుండు. ఎడనెడ శృంగారరస ప్రధానములైన ఉషాపరిణయము, రాధాకృష్ణుల పరిణయము గోపికావిరహము మొదలగుకథల గేయనాటికలుగఁబ్రదర్శించుచు ప్రేమరసమును మృదుమధురగేయరూపమునఁ గుమ్మరింతురు ఎట్లన

కాంభోజిరాగము- ఆదితాళము

ఏమో భ్రమ గల్గెరా- నీమోముఁజూడనా ॥ఏమో॥
రతిపతినిభ చిఱునగవునరా నీయధరా
మృతమతి ముదమునఁ గ్రోల నా ॥ఏమో॥
తాళఁజాలరా మరునిశరములకు

జాగదేల బిగికౌఁగిటఁ జేర్పనా ॥కేమో॥
కోమలాంగనే కోరి చేరితిని
కామకేళివిలాస సౌధంబు చేరరా
కోర్కెదీర్పరా కొసరి వేడుచుంటి నవ
మోహనాంగనా .... ॥కేమో॥

వ॥ శ్రీత్రైలంగున లలితకళా విలాసముల మానసికానందము పొందు చుండ నియ్యది యదనని గౌతమునకు వివాహముసేయ తలిదండ్రులు నిశ్చయించుకొనిరి. ఇంతలో శాక్యులకొక పండువు రాఁగా రాజగృహంబున గౌరీవ్రతంబుసేయ సంకల్పించిరి. ఆ సమయమున అచటి, రాజకన్యల రప్పించివారికి బంగరు బహుమతుల నిప్పించి వారిలో సిద్ధార్థుఁడు కోరిన కన్యనతనికి భార్యగాఁ జేయవలయునని మహారాజుగారు సచివాగ్రణికిఁ దెలిపిరి. అంత మంత్రి తత్కాలోచితకృత్యముల నిర్వర్తించుచు

: కల్యాణము :

— రగడ —

అన్నిదేశముల రాచకన్నెలకు- ఆహ్వానము లంపె
కన్నెలకీయఁగఁ గనకవస్తువుల- గదులుకొన్ని నింపె
తెల్లవారు సరికెల్ల పట్టణము- దివ్యకళల వెలిఁగె
ఉల్లాసంబునఁ బ్రజాసమూహము- లుత్సవమున మెలఁగె
వచ్చిరి పలువురు రాచకన్నియలు- వ్రతమును వీక్షింప
తెచ్చిరి పూజాద్రవ్యములెన్నో- దేవుఁడు రక్షింప

వ॥ అత్తఱి కోలీపట్టణంబున సుప్రబుద్ధభూపాలునికూఁతురు యశోధర గౌతముని సౌందర్య సద్గుణాదులువిని అతనిని వరించి గౌరీవ్రతమునుజూడ తండ్రి యనుమతింప తల్లితో పల్లకి నెక్కి కపిలవస్తుపురము సేరె.

— రగడ —

అందముచిందెడి దేవకాంతలును- ఆమెకు సరిగారు
ఇందునిభాస్యకు విద్దెలలోసతు- లేఁసాటిరారు
తొలకరిమెఱపును మించిమెఱయు ఆ- తోయజాక్షి మేను
కలుములచెలివలె సర్వభోగముల- కాంచఁగలదు తాను

॥ అట్టి యశోధర సౌందర్యమునుజూచి సిద్ధార్థుఁడు ముగ్ధుఁడయ్యె ప్రథమదర్శనంబున వారియిర్వురి చూపులొండొంటిగాఢాలింగన మొనర్చుకొనె. గౌరి వ్రతమున రాజపుత్రుఁడు రాజకన్యలకు బంగారు బహుమతులనిచ్చుచు పిత్రుదత్తరత్నహారమును యశోధరకిచ్చె. మంగళగీతములతో వ్రతము పూర్తియయ్యె. యశోధరను తనకుమారునకిమ్మని శుద్ధోదనుఁడుదండపాణి భూపాలుని గోరె. దేవదత్తునిదుర్బోధచే సిద్ధార్థుఁడు పిఱికిపందయని నమ్మి దండపాణి ముందుగఁదనకూఁతు నీయ సమ్మతింపక ధనుర్విద్యా ప్రదర్శనము జరిపించియందు సిద్ధార్థునకే ప్రథమబహుమతిరా అప్పుడతనికిఁ దనకూతునిచ్చి మహావైభవముతోఁ బెండ్లిచేసె.

— రగడ —

పట్టినదెల్లను బంగారంబుగఁ- బరిణమించుచుండె
ముట్టినదెల్లను ముత్తెమ్మైకడు- మోదమొసఁగుచుండె
చుక్కలనాతఁడు పూర్ణచంద్రువలె- చూడఁబడుచునుండె
ఎక్కడచూచిన విలాసదృశ్యము- లెసకమెసగుచుండె

వ॥ ఆమె శృంగారరసవాహినియైపొంగె, అందతఁడు రాజహంసయై తేలియాడుచుండె. ఇట్లా నూత్న దంపతులు రతీమన్మథులవలె రాజభోగములనుభవించుచుండఁ గొంతకాలమునకు వారికి రాహులుఁడను కొడుకుపుట్టె. తరువాత ఒకనాఁడు రాజకుమారుఁడు తన పట్టణమునఁగల ప్రజలజీవయాత్రలెట్లున్నవో చూడవలయునని తండ్రికిఁ దెలియకుండ పోవనిశ్చయించుకొని విశ్వాసపాత్రుఁడైన చెన్నునితోఁగూడిఁ మాఱువేషములతోఁ బట్టణ ప్రధానవీథిఁ బ్రవేశించెను.

: నగర సందర్శనము :

— రగడ —

పూచినతంగెడు పోలెనుండెను- పురవీధుల చాలు
చూచుచువారలు రాజమార్గమునఁ- జొచ్చిరి అప్రోలు
ఈఁగలురేఁగిన తేనెతుట్టివలె- ఎనగిరి జనులెల్ల
వీగతిఁజూచిన రాకపోకలకు- ఇంతయెడముకల్ల

బట్టలకొట్టులు వెండియుంగడులు- బంగారపుగొట్లు
బుట్టలుతట్టలు కూపండ్లబజారులు- పూవులమ్ముచోట్లు
మల్లెలుమొల్లలు సన్నజాజిచే-మంతులుబంతులతో
వెల్లివిరిసె నొకవీధియంతయలి- వేణుల బంతులతో

వ॥ ఆ పూలబజారులలో పూవులమ్ముకొనుచు, కొనుచునున్న యువతీయువల చమత్కారవచనములెట్లున్నవన-

— రగడ —

సగమువిచ్చినది ఈగులాబివెల- సరిగఁ జెప్పబాల!
వెగటుగనుండిన కొనవలదెగుము- వేయిమాటలేల?
బొందుమల్లెలను వలిపెములోపల- పొందుపఱిచితేల?
దండిదొరలుగని ధరనిచ్చినచో- దాచుకొనముపూల
ఎన్నితుమ్మెదలు త్రాగిపోయినవొ- ఈపువ్వులరసము
ఎన్నిత్రాగినను వాడవించుకయు- ఎందుకింతహసము
వాడినకొలంది వింతవాసనలు- వచ్చెడీ సంపంగి
అదుము బేరము అన్నియునొసంగెద- అవసరమునవంగి

వ॥ అనిపల్కుచుండ విని వారుపోవుచుండఁగా ఒక ముదుసలితొక్కు కఱ్ఱపోటించుకొనుచు భిక్షాపాత్రచేతఁ బట్టుకొని-

— రగడ —

కన్నులులేని కబోదిని బాబా- కనుఁడు నాదుగోడు
పున్నెముగలుగును దానముసేయుఁడు- పొట్టనిండునేఁడు
దిక్కులేని యీపక్షిని బ్రోవఁగ- దేవుఁడుమిముఁజూపె
మొక్కుచుమీరిడు రాగిదబ్బుకై- ముదుసలిచేచాపె
ఆఁకలితీఱక నకనకలాడుచు- అల్లాడెదసామీ
మీకిది తెల్పఁగరొప్పవచ్చెడిని- మేనబలములేమి
పక్కలెండినవి డొక్కలాగినది- బరువైనది బ్రతుకు
గ్రక్కునఁజూచెడి వారులేమిచే- కఱవైనది మెతుకు
చంకనున్న మీచక్కనిబిడ్డఁడు- సరిగవృద్ధిపొందు
శంకరుకృపచేమీగృహంబునను- సౌఖ్యము పెంపొందు

వ॥ అని దీనాలాపములాడుచున్న బిచ్చగాడినిజూచి ఆశ్చర్యపడి సారథిఁగని చెన్నా!

చ॥ తనువున రక్తమాంసములుతగ్గి నరంబులుపైకినుబ్బ తె
ల్లని కురులెల్ల వ్రేల ముఖలాల తొఱంగ తెఱంగుతోఁపక
వణకుచు వింటిబద్దవలె వంగి కరంబునఁ గఱ్ఱయూఁతగాఁ
గొని నడయాడలేక కడుఁగూయిడు ఈతఁడెవండు తెల్పుమా

వ॥ అనియడుగ నాల్గుదశలం గడపటిదశయిది యనిచెప్ప దానికి బుద్ధుఁడు

"నేనును ఇట్టిదశ అనుభవింపవలయునా?"

"ఔను"

"నీవో"

"నేనును"

"యశోధరకూడనా"

"ఆమెయు"

"రాహులుఁడు"

"రాహులుఁడు కూడ"

"చెన్నా! నాకడుపులో చేయిపెట్టికలచినట్లున్నది"

వ॥ అనియిప్పరకు సంభాషణ జరిగినపిదప నాలుగడుగులు నడవ ఒక కుష్ఠరోగి కనఁబడె, ఆతనినిజూచి సిద్ధార్థుఁడు సారథీ! ఒడలు జలదరించుచున్నది.

ఉ॥ ఈగతి నేలపైఁబడివచింపఁగరాని నికృష్టజీవియై
వాగుచులేవలేక చెడువాసనచే తనవంకకెప్పుడుఁ జా
మూఁగుచునున్న యీఁగలనుమూల్గుచుచేతులఁగాళ్ళఁదోలుచున్
దొఁగుచునుండె రక్తమునఁ దోఁపకయొవ్వఁడు వీఁడుసెప్పుమా

వ॥ అన ఈతఁడు కుష్ఠరోగియని చెన్నుఁడుచెప్పెను. దానికాతఁడు

— రగడ —

ఏకారణమునఁజూడ సహింపని- ఈరోగము గలుగు
ఏకదీక్షతో నెవనిభజించిన- ఈపాపము తొలఁగు

వ॥ అనిప్రశ్నింప చెన్నుఁడు శిశుహత్య స్త్రీహత్య మొదలగు మహాపాపములు చేసినవారికి ఇట్టి దీర్ఘవ్యాధులు గల్గునని పెద్దలనుచుందురు. కావున నివిచర్మవ్యాధులుగావు, కర్మవ్యాధులని పల్కెను. సిద్ధార్థునిమనను నీరైపోయె ముఖమున విచారము తోఁచె. ఈవ్యాధికి మందులేదాయని పృచ్ఛింపనాకుందోఁపదని చెన్నుఁడుచెప్పె. ఇట్లు సంభాషించుకొనుచు పట్టణపు చివరి భాగమునకు వచ్చినంత పేదల కొంపలుచూచి సిద్ధార్థుఁడీ జీర్ణ కుటీరముల నివసించువారెవరన

— రగడ —

కండలుగరఁగఁగ మేడిపట్టుకొని- కష్టించెడివారు
నిండుమనంబున భూమినినమ్మిన- నీతిపరులువీరు
ఎఱ్ఱనియెండని జోరునవానని- ఎపుడు జంకఁబోరు
నఱ్ఱలఱంకెలు లెక్కసేయకయ- నాఁగలితోలుదురు.
మట్టిత్రవ్వి మనదేశప్రజలకై- మణులనెత్తువారు
పొట్టకూటికే కష్టములంబడి- పొగులుచుండువారు
కమ్మనితిండికి చక్కనిబట్టకు- కఱవునఁబడిపోయి
ఎమ్మెయిఁజూచిన లోకయాత్రలో- ఎఱుఁగరింతహాయి
బడబాగ్నినిదన పొట్టఁబెట్టుకొని- పాలుపరులకిచ్చు
పుడమికిఁగూర్చుచు పైరుపచ్చనగ- మురియుచు మదిమెచ్చు
వంచెనచేసెడి పిట్టలఁగొట్టఁగ- వడిసెలచేఁబూను
మంచెయనెడి సింహాసనమెక్కును- మహినేలగఁదాను
కొంపకువచ్చిన ఇతరుఁడెవ్వఁడును- కుడువకుండఁబోఁడు
ఇంపగుమాటలఁ దృప్తిపఱుపఁగా- నెంతయుఁదగువాఁడు.

వ॥ ఇటుచూచితిరా. వీరందఱు వస్త్రకారకులు.

— రగడ —

అలుబిడ్డలును దరిద్రమునఁబడి- అఱఁగిపోవుచుండ
కూలిచేసినను జాలకబ్రదుకులు- కుమిలిపోవుచుండ
కాలధర్మ రథచక్రముక్రిందున- కాయమునువియ్యైన

ఏలయిట్టితను వెంతపాపినని- ఎంచఁడు మదిలోన
జిలుగు వస్త్రములు తయారుచేసెడి- సిద్ధహస్తులిట్లు
వెలుఁగు నీడలలవేగుచుందురివి- బీదలుపడుపాట్లు,

వ॥ ఇంక నిటుచూడుఁడు

— రగడ —

రస్తాలన్నియు బాగుచేసి మను- ప్రజలువీరు ప్రభువ
నిస్తులకష్టము చేసెడిజీవులు- నింపుముదయ నీవ
బాడిగబండులు తోలెడివారలు- బజారులివి దేవ
మేడలు మిద్దెలులేవు వీరలకు- మేలుగూర్పలేవ
ముఱికిపేటలను జక్కసేయుటది- ముఖ్యమందు దేవ
నిఱుపేదలపై దయచూపుటయే- నీకుఁదగినసేవ
అలమందలను మరల్చువాఁడే- అర్జునుండు సామీ
పాలితులగు మనప్రజల పద్ధతుల- బాగుసేయవేమీ.

వ॥ అని పల్కుచుండ.

— రగడ —

కొత్తకుంచయును నిప్పుపట్టుకొని- కొందఱు ముందుండ
చిత్తము శత్రమంద నేడ్చెదెను- జిక్కికొందఱుంత
వాహకులేడిరము మోసికొనుచునిటు- వచ్చుచున్నవారు
బాహుళ్యంబుగ జనులువెంబడిని- బయలుదేఱినారు

వ॥ ఆ విషయమునుగూర్చి చెప్పుమనియడుగ చెన్నఁడు "శవమును శ్మశానమునకుఁ దీసికొనిపోవుచున్నారు. చచ్చినవాని బంధువులు ఏడ్చుచున్నా" రన సిద్ధార్థుఁడు విచారపడి "సారథీ! అందఱు చావవలసినవారే గదా" యని ప్రశ్నించె. అపుడు చెన్నఁడు

— రగడ —

చావుపుట్టువులు సర్వజనులకును- సహజములు కావా
ధీవర! ఏరికినిగుఱు పొందెనవు- తెలిసిమూర్ఖఁగలవ.

వ॥ అనుచుండఁగ రాకుమారుఁడు శ్మశానమువద్దరకువెళ్ళి విచారముతో నిలిచియుండ, ఒక సన్యాసి.

చ॥ జగమొక బొమ్మలాట రవిచంద్రులు దివ్వెలు పాత్రధా
రుగణిత జీవులెల్ల పరమాత్మ నిరంకుశ సూత్రధారియై
తగినటు త్రిప్పు మాయ తెరదాగును పాడును సత్యగీత
యుగవనవార్ధి పట్టణము లాతనిరంగ కథార్థదృశ్యముల్

వ॥ అని పాడుచు అదృశ్యుండయ్యె. దాని భావమును ఆలో
చించు యువరాజును బతిమాలి చెన్నుండు ఇంటిదారి
ఆ రాత్రి.

—: వైరాగ్యము :—

పటుతరపాపము- వ్యాపించినదన ..... తందానా
కటిక చీకటులు- క్రమ్మెను జగమున
ఎత్తగుపందిరి- ఏర్పడినట్లుగ
ముత్తెపుగుత్తులు -పొదివినట్లుగ
అద్భుతరేయిని- ఆకసంబున
నిద్దపుజుక్కలు- నిండియుండెను ...... తందాన.

వ॥ అప్పుడు సిద్ధార్థుండు కలవరించుచుండె. ఆకలలో—

శా॥ లేరా మానవసంఘ సంస్కరణకై లీలావిలాసమ్ముగా
పోరా ఘోరగుహా విహారరతి- సద్బుద్ధిన్ తపస్సిద్ధిచే
రారా బుద్ధుండవై త్వదీయ మహిమన్- రక్షింపరా లోకమున్
నీరాకంగని భారతావనిమణీ నీరాజనం బిచ్చురా

వ॥ అను ప్రబోధగీతము వినంబడె.

— రగడ —

ఈశ్వరాజ్ఞచే నాతడు మేల్కనె ఈజగమును బ్రోవ
శాశ్వతసౌఖ్యము సర్వప్రజలకును- సాధించెడి త్రోవ
బిడ్డతోడ నిదురించుచున్న తన- ప్రియురాలిని జూచె
గడ్డనమస్యలు కొన్ని డెందమున- గాఢముగా దోచె
సముద్రమథనము జరుగుచున్నదా- సత్పురుషుని మదిలో
అమలామృత మెపుడవతరించునో- ఆమహాత్మునెదలో

వ॥ అత్తఱి యశోధర సుఖమెట్లున్నదనంగా

— రగడ —

జిలుగుమబ్బులో వెలిగెడిచంద్రుని- శ్రీకాంతికినఖము
వలిపపుమేలి మునుఁగున వెలిగెఁడి- వారిజాక్షి ముఖము

౫॥ అట్టి మోముఁజూచుచు.

చల్లఁగదిగెను- శయ్యనుండితా .... తందాన....
మెల్లఁగరాహులు- మేనుగాంచెను
జల్లనహృదయము- జలదరించెను
కల్లోలంబున- కలఁకబారెను
భార్యాపుత్రుల- వదలఁదలఁచెను
కార్యభారమున- కదలినిలిచెను
ప్రేమబంధమును- ద్రెంచివైచెను
కామిని మోమును- గాంచిపక్కగా
ఇల్లువిడిచినే- నేగుచుంటిని
ఇల్లాలినినిపు- టిట్లుసేయఁగా
పల్లవపాణిరో- పాపమునుమ్మ
ఎల్లరశ్రేయము- ఎంచితినమ్మ
నీప్రవర్తనమె- నీకురక్షణము
నీప్రభావమె- నీకుకవచము
వీరమాతవై- విలసిల్లుదువు
ధీరనారివై- తేజరిల్లుదువు
ఈపసిబిడ్డను- ఎట్లుచూతువో
తాపసవర్యుల- దాపునకేగెద
ధర్మసూత్రముల- స్థాపించుటకు
కర్మబంధముల- ఖండించెదనే
పామునోటితోఁ- బడినకప్పయును
ఏమెయిఁజిక్కిన- ఈఁగయుంచును
నోరుచాపిమృతి- నోటఁజిక్కెను
ఏరికిసౌఖ్యము- ఎట్లుదక్కెనో
ఈజన్మంబిట- కెట్లువచ్చెనో

ఈజన్మాంతమున- ఎవుడుగల్గునో
ఎక్కడిమేడలు- ఎక్కడిమిద్దెలు
ఎక్కడితల్లులు- ఎక్కడితండ్రులు
ఎక్కడిభార్యలు- ఎక్కడిబంధులు
ఎక్కడిపుత్రులు- ఎక్కడిమిత్రులు
వెలుఁగుజాడలో- వెలసినసత్యము
వెలిబుచ్చఁగనే- వెడలెదఅడవికి
హరిహరులడ్డం- బైననుగాని
తిరుగదునామది- స్థిరతమాని

వ॥ అని తనలోఁదానను కొని

స్థిరపడిమెట్లను- దిగుచునుండెను
తిరిగిచూచుచును- దిగ్భ్రమచెందెను
ఉయ్యాలలూఁగెను- ఊహలన్నియును
చయ్యనముందుకు- సాగెనుపాదము
అంతటనడచెను- హయములశాలకు
చెంతనిద్రిలో- చెన్నుఁడుండెను

వ॥ అపుడు చెన్నునినిద్రలేపఁగా అతఁడులేచి యువరాజా! ఈ నడురేయి ఎక్కడికి పోవలెను. అసితుఁడను బ్రహ్మజ్ఞానులకని సిద్ధార్థుఁడననందనుఁడని యతఁడు ప్రశ్నింప సన్యసించి సత్యజ్ఞానమంది విశ్వశాంతిచేకూర్చుటకని రాజకుమారుఁడు పల్కఁ దండ్రిగారి యాజ్ఞయున్నదాయని వాఁడడుగ నతఁడు లేద”న లేనిచో మనము బయటికి పోరాదని శాసించెనుగదా, కావున

— రగడ —

చండశాసనుఁడు రాజుకోటనే- జవదాఁటుటయెట్లు
కంఠకాశ్వమును దాఁటించియుఁ గ- గలుగవెయుగవాట్లు
ముందునూయి నావెనుకగోయిటెటు- పోవకాళ్ళురావు
మందభాగ్యునను రక్షింపఁగనా- మాటవినుము నీవు
అంతఃపురమునఁగాంతలెల్లనను- ఉల్లాడుదురయ్యా
చింతలేక నీతల్లిదండ్రులిఁక- చిక్కిపోదురయ్యా

నిన్నే ప్రాణముగా పోలెను జూచెడి- నీసతిగతియేది
కన్నారంగని మమ్ములం బోషించెడి- కార్యమెల్లనిది
ఏమిలోటునీకిట్టివయస్సున- ఇల్లువిడిచిపోవ
వేమయనీపదమంటి వెడెదను- వెళ్ళవలదు దేవ
ఎండవానలకుం జెట్లక్రిందనీ- వెట్లుండంగలవు
కొండగుహలలో నొంటరిగానెటు- కూరుచుండంగలవు
పులులు సింహములు శరభమృగంబులు- పొంచియుండునడవి
పలలభక్షణము సేయంగ ప్రాణుల- బాధించునుదడవి
నాల్గుపాదముల ధర్మముదప్పక- నడచును మీరున్న
ఎల్గురాలుపద ధర్మదేవతయు- ఏడ్పుమీరుచున్న.

వ॥ అని కాళ్ళమీఁదఁబడి బ్రతిమాలుచున్న చెన్నుని లేవనెత్తి

శా॥ చెన్నా! అన్నులమిన్న కన్నగవమూ సెందనూ జాతుఁడున్
మున్నే నిద్దురఁదోఁగియుండెనదియే పోఁబాఁటిపోవీలునీ
కన్నన్యాయమెవండొనర్పు నిపుడీగాఢాంధకారంబునం
దన్నా. వాహముదెమ్ము పోవలయు మోక్షానందముంబొందఁగా

వ॥ సూర్యచంద్రగతులు మాఱినను నామనసు మాఱదనియా శాక్య రాజతనయుండన సారథి విధిలేక గుఱ్ఱమునకు జీను తగిలించెను. తెల్లవారునరికి నిర్మలగర ప్రాంతంబుల తీరమునకుం జేరి. సిద్ధార్థుండు తన రత్నహారాదులను, శిరోజములను చెన్నునకిచ్చి గుఱ్ఱమును జూచి ఓ అశ్వరాజమా!

— రగడ —

బహుకాలము నిన్నెక్కి సుఖముగా- స్వారిచేసినాఁడ
ఆహరహమెంతయో అలసటపెట్టిన- అజ్ఞానినిజూడ
సంతోషంబున నన్నుఁగన్నచో- సకిలింతువువాజి
వింతప్రేమతోఁ దలనాడించుచు- పిలుతువునను తేజి
మితమునిపోలెను కష్టసుఖంబుల- మెలఁగితెపుడు నీవు
పాత్రతగలిగిన వాహరాజమనఁ- బరఁగఁజాలితీవు
ధర్మశీలయగౌ యశోధరాసతి- దయనుజూపఁగలదు
నిర్మలమతితో నీదుపోషణము- నెరపుచుండఁగలదు.

విశ్వాసముగల చెన్నుడొక్కఁడే- వెలయునీకుఁదోడు
అశ్వరాజమా! వదలుచుంటినా- ఆశవీడు నేఁడు

వ॥ అని అతఁడుపలుక ఉత్తమాశ్వముగాన ఆమాటలలోని భావము గ్రహించి-

— రగడ —

తలనువంచినది నాల్కసాచినది- ధైర్యముపడినది
జలజల కన్నులనీరుగార్చినది- జాలిగూర్చినది.
పిడఁజాలనన్నితెల్పుడరీతిగ- వింతగఁజూచినది
చేతులొంటినన మెడనాతనిదెస- వేగముచాచినది
కొయ్యబొమ్మవలెనిల్చె చెన్నుఁడు- గోడుచెందుచుఁడె
అయ్యానేనిపుడెట్లు పోదునని- అలమటించుచుండె
కాళ్ళవ్రేళ్ళఁబడి మ్రొక్కుచుంటినను- కరుణింపుము దేవ
వెళ్ళిపోవుటకు కాళ్ళురాకనిను- వేడుదు సద్భావ
అడవులలోఁబడి యెటకోపోయెద- అజ్ఞనెమ్మి నాకు
ఒడయుని మొగమే నెట్లు చూచెదను- ఒప్పదిద్దినీకు

—: వియోగవ్యధ :—

వ॥ అనిప్రార్థించినను వినమింజెన్నుఁడు తిన్నగ గుఱ్ఱమునుమరలించుకొని యింటికివచ్చెను. అంతఃపురమున యశోధర మేల్కాంచి భర్తంగానక చెలికత్తెలచే వెదకించుచుండ గౌతమీ వృద్ధరాజులుఁదెలిసి గుండెలు బాదుకొనుచు ఆమెదగ్గఱకు రా ఆయమ మగని పాన్పుపైఁదలవాల్చి కన్నీరుమున్నీరుగఁబాఱ

ఉ॥ పుట్టితి రాజవంశమునఁ బుణ్యవరేణ్యుని శాక్యసింహుఁజే
పట్టితి ముద్దులొల్కునొక పట్టినిగాంచితిజీవయాత్ర యిం
కెట్టుల సాగిపోవునని యెంచఁగలా! విధికెంతగాఁగనుల్
గుట్టెనో ప్రేమపల్లి తెగఁగోసెను చిట్టెపుజాతి గుండెతో.

వ॥ కిరణావతీ! ప్రాణపతీ! నీప్రియురాలి గతియేమిచేసితి?

ఉ॥ ఏసునుదాన నెట్టులిఁకనే మనుదాన వియోగవహ్నిచే
నామది గాల్చఁగాఁదగునెనాథ! అనాథనుజేయుపాడియే
రాములునన్నుఁజూచి యభిరామనుగాఁ దలపోయుచుండ ఆ
తేపులలోన నాబ్రతుకులేవడి పాలొనరించి తక్కటా.

అని దుఃఖించుచు పాన్పుపైఁబడె. గౌతమిహా కొడుకాయని
మూర్ఛిల్లె శుద్ధోదనుఁడు కన్నీరుగార్చుచు -

చ॥ నినుగని పెంచినట్టి జననీజనకుల్ కృశియించిచావఁగా
నినుభగవంతుఁగాఁగొలుచునీసతిగుండెలుక్రూలిపోవఁగా
నినుదమరాజుగాఁ దలఁచునీప్రజలెల్లరు చింతనొందఁగా
తనయ! విరాగివై చనుట ధర్మమ? ఇట్టిది పుణ్యకర్మమా.

చ॥ చివిమినఁ బాలుగారుననుఁ జెక్కులపాటలకాంతి నంతయుం
జెవరఁగలేదు దంపతుల సిగ్గొకయింతయుఁదగ్గలేదు, దు
ర్మదరిపుజిత్వరిభాకలితరాజ్యరమామణిఁ గూడలేమ నీ
హృదయముకీరాయిచేసికొని యేగితివా జగముద్ధరింపఁగా.

వ॥ అని శోకించుచుండ ముఖ్యబంధువులోదార్చుచుండిరి. ఇంతలో గుఱ్ఱముతో చెన్నుఁడు రా ముసలిరాజు దుఃఖము క్రోధముగ మారి పటపట పండ్లుకొఱుకుచు చూచి యొరీచెన్నా!

— రగడ —

తిన్నయింటివాసాల నెన్నెదవు- తెలిసెను నీచలము
ఎన్నిజన్మములఁ దీఱిపోవఁగల- దీంతపాపఫలము
అర్ధరాత్రమున యువరాజును నీ- వడవిపాలుచేసి
వ్యర్థపుఁజూపులతోడ డాసితివి- ప్రాణభయమువాసి
కత్తినెత్తి నీకుత్తుక నిప్పుడె- ఖండించెదఁజూడు
ఇత్తఱి నీతల కోటకొమ్ముపై- కెత్తి కాల్తునేఁడు.

వ॥ అని.

కన్నుల మంటలు రేఁగఁగా ...... పై
చెన్నుని ముక్కలు సేయఁగా
గాలిని పెల్లుగఁ ఊర్చెను
కాలు నిరూపము దాల్చెను
కసితో మీసము దువ్వెను
ముసలి సింగమన దూఁకెను
ఒఱలో కత్తిని లాగెను
కరకరి చూపుననూఁగెను
చెన్నుడు శిరమును వంచెను
కన్నుల శాంతము నించెను

మంత్రి రాజును జూచెను
చింతం జెందుచు సామచు
పంతము వలదని అంపెను
వింత ఘట్టమును జూపెను,

వ॥ అప్పుడు చెన్నుడు నమస్కారముచేసి-

— రగడ —

కన్నతండ్రివలె నింతకాలమును- గాచినారు మీర
చెన్నుని కనుమిదె ఖండింపుండిక- చెప్పెద కనిదిదె
మహాత్ముడగు మన సిద్ధార్థుని నే- మఱచియుండగలన
ఆహోరాత్రములు ఈ పాపంబున- కడలుచుండగలన
నాచేతులలో పెరిగిన బిడ్డను- నటవుల విడచి
ఈ చెంతంబెటు సమ్మతించెద- ఏనెటుగన రేడ.

వ॥ అని మంత్రి జరిగినదంతయు జెప్పుమన సారథి పూసగుచ్చినట్లు చెప్పి సిద్ధార్థుని వస్త్రములను, భూషణములను, శిరోజములను అచ్చటనుంచి యో మహారాజా! యువరాజుగారు

రాగ - మధ్యమావతి- త్రిశ్రజాతి త్రిపుటతాళము

నన్ను తొందర పెట్టెను- గుఱ్ఱమును దెమ్మని- నన్ను తొందర పెట్టెను ॥నన్ను॥

నన్ను తొందరపెట్టి యాతడు- నాతని విడనాడగోరుచు
నన్నుయింతయనెను భూమి వల్లభునితో జెప్పుదగునన ॥నన్ను॥
నిన్ను నడవికి జేర్చునంతన- నన్ను నరవరుడూరకుండున
విన్నవారలుగూడ నన్నిక- నెన్నిగా నిందింతురనగా ॥నన్ను॥
అప్పుడయినను నీవు నాపయి- గోపగింపక నిల్వుమిటనన
పాపపంకమునందు నిలువను- బాయుదును భోగములననుచు ॥నన్ను॥
తల్లిదండ్రులు నిదు భార్యయు- దగని దుఃఖములందుచుండగ
ఇల్లు వెడలుట చెల్లదీవన- నింతయును మదిమార్చుకొనకే ॥నన్ను॥
మీకు నపకృతునే నొనర్తున- మీదతేగద సౌఖ్యదాతలు
మాకు నమ్ముడు నిజము సుబ్ర- హ్మణ్యవరదుని సాక్షిగావిను ॥నన్ను॥

వ॥ దేవా! ఆ పుణ్యశ్లోకుని వీడ్కొనివచ్చుచున్నప్పుడు కన్నీళ్ళతో వారి పాదములంటి యడిగి పాదుకలు నాకు ప్రసాదింపుఁడని వేఁడ ప్రేమతో నొసంగె. ఆకరుణాలవాలుఁడు తిరిగివచ్చువఱకు నేను వీనిం బూజించుకొనుచుండెద.

చ॥ ఎవని విరాగకీలలకు- ఈపురలక్ష్మి తపించుచున్నదో
ఎవని పరోపకారమున- ఈజగమెల్ల సుఖింపనున్నదో
పవిమలుఁడైన యాసుగతు- పావనపాదములుంచినట్టి యీ
శివకరదివ్య పాదుకలు- శీర్షముపై నిడుకొందు భక్తితో.

వ॥ అని చెన్నుఁడు సెలవుతీసికొని యశోధరాదేవిని సమీపించి

— రగడ —

అమ్మా చెన్నుని నమస్కారముల- నందుకొనుము తల్లి
ఇమ్మెయి పలిపిన దుర్మార్గుండని- ఎంచకు గుణవల్లి
కమ్మని నేరను చేదుమేయుఁగా- కాలము చనుదెంచె
అమ్మరో అశ్వము నాతోఁబాటుగ- అడలుచు నేతెంచె.

వ॥ అనుచుండ యశోధర కన్నీరు గార్చుచు,

రాగము- ఆనందభైరవి- త్రిశ్రజాతి త్రిపుటతాళము

ఎంతకీడొనరించితయ్యా- జనిసేవకుండ కునిద్దిచేటుగదయ్యా ॥ఎం॥
ఇంతచేసితివు- ఇనుఁడుగా దెవఁడైన
శిక్షసేయకనిన్నుఁ- వీక్షింపఁగలఁడా ॥ఎం॥
సారథి వినవయ్యా నీవు- సతము భూపుని సౌఖ్యమె
మదిఁగోరినేఁడు- చింతగలుగఁజేసితేల
జ్ఞానహస్తకరత- వారిగానఁగలేక
నవసిద్ధైవము వేఁడ- వనుగాదలేఁడ ॥ఎం॥

వ॥ అనియశ్వముఁ జూచి-

— కథ —

భార్యాపుత్రుల వేఁడునేయని- ప్రాణముల నిచ్చి
ఆర్యపుత్రుఁ నిష్టపక్షులవి నుమ్మ- అశ్వమ నీ తప్పె
ఎంత యేడ్చినను నాచునేవుని- ఎవరు తేగలారు

ఇంత సేతకయు పెండ్లితమానిను- ఏమి నీదు తీరు
ఆత్మజమమ్ముల నిద్రలేపుటకు- ఆఅపజాలవైతి
ఆత్మజనింతగ చింతపొందుటది- ఎవరు మెచ్చు నితి

వ॥ అనుచు చెన్నకగరి

— కథ —

కంచెయు చేసిపడినదలంచినచో- కాపే మోసరించు
మంచియెల్ల ఈరీతిగ మాజిన- మాకేమనిపించు
నాకేమైనను సందేశంబును- నాథుడంపినాడ
వాకొనదగు శుభవాక్యములున్నను- పలుకుము నాతోడ.

వ॥ అన సారథి నమస్కరించి

— కథ —

అమ్మా యేమని తెలుపవాడనే- నా మహాత్ముపలుకు
ముమ్మరమగు తనదీక్షను దెలిపెడి- పులకండపుంబలుకు
శ్రద్ధతోడనే తపముచేసి పర- సౌఖ్యసుధను దెత్తు
బుద్ధుడనైనే తిరిగివచ్చితిన- మోహావృత మిత్తు

: సిద్ధార్థుడు బుద్ధుడగుట :

వ॥ అనినని సెలవుతీసికొని యాతడు వెడలిపోయెను. అక్కడ సిద్ధార్థుడు ఉరువేలారణ్యమున ప్రవేశించి మహాత్ములవలన బ్రహ్మోపదేశము పొందియొక రావిచెట్టుక్రింద గూర్చుండి తపస్సు ప్రారంభించెను. సంవత్సరములు గడచిపోవుచుండెను. మన్మథుడు తన బాణములను ప్రయోగించి సుకల యశోధరపై మనసు గలిగింప యత్నించి విఫలమనోరథుడయ్యె అప్పుడాకాశవాణి.

ఉ॥ ఎవ్వని పూవుటమ్ములకు- ఈశుడుసైతమొకింతలొంగెనో
ఆవ్విలుకాడు మన్మథుడ- హంకృతితో విరజిమ్మినట్టి ఆ
పువ్వుల బాణపంచకము- వ్యర్థముగా వృథయయ్యె దేవతల్
పువ్వులు చల్లుచుండిరిక బుద్ధుడవైతివి లెమ్ము తాపసీ!

వ॥ అని పలుక నమ్మహాత్ముడు దివ్యజ్ఞాన సమేతుడై బ్రహ్మానందమును గనుచు తెలచియు శుష్కించియున్న కారణమున నా చెట్టు క్రింద పరుండె. ఇంతలో రాముడను మంగకాపరి ... టిక్...

...హై ... ఇస్స్ ... కూ ... ఏముందరా నీముందజావ నడవనే నడవదేంరా ఈకుంటిగొఱ్ఱపిల్ల యేం అడ్డాలు తిరుగుతుందిరా. కాళ్ళ సరిగ్గావుంటేగా పట్టసిక్కంగాదురా. అదెక్కబోను ఇదెక్కబోను. ఆ పొదలోదూఱి. ఈపొదలోదూఱి. పాదరసంలాగా పారకాడద్దే మూపుండ కుక్క మూంచి తెలివికల్దికాబట్టి పిల్లబీగపోకుండా పాలెసుగోత్తుంది. ఏలినోరిబిఖ్ఖు కావలసినన్ని తాగినాయి. కమ్మగా మెప్పులున్నా. ఈమేకబుద్ది యేంబుద్దోగాని మోనుదొంగిగిన మొక్కగనవడ్డదా తల గొక్కటమే ... టిక్.. ...ఇస్స్... ఎండేళగదూ, ఈ రాగిచెట్టునీడ ఇఱ్ఱపిల్లల్లాగా నిలబడ్డాయి నానుగూడ రవ్వంతసేపు నిలబడతా." అని నిలిచి

— గేయము —

సిక్కవేమిరా కిష్టా సిక్కవేమిరా ॥సిక్క॥
ఎన్నముద్దుల దొంగా ఏడెవనిను రారా
రేపల్లెవాడలోన ఎలసిన చిన్నికిష్టా ॥సిక్క॥
గోవర్ధనగిరియెత్తి గొల్లలను కాపాడి
కాళింగుతలమెక్కి ఘల్లుఘల్లన ఆడినావు ॥సిక్క॥
సీరలన్ని సంకబెట్టి చెట్టునెక్కి కూచోని
గోపికలను కొంతసేపు గుసగుస లాడించినావు ॥సిక్క॥

వ॥ అని పాడుకొనుచు బుద్ధునిజూచి ఆహారములేక చిక్కిపోయినాండని గ్రహించి మేకపాలు ఆయననోటిలో పిండెను. అవి త్రాగి లేచికూర్చుండి యున్నమహాత్ముడాం రావి చెట్టునకు బోధి వృక్షమని పేరిడె. ఇంతలో సేనానియనెడి పల్లెలోని యాదవ శ్రేష్ఠుని యిల్లాలు- ఆ చెట్టును సమీపించె.

— రగడ —

రావిచెట్టునకుం బ్రదక్షిణములా- రమణిచేసినంత
శ్రీవిభుక్కృపచే గర్భమువాల్చెను- చెన్నుగ నక్కాంత
పెద్దల దీవనలొప్పు సుజాతకు- పెన్నిధియుతండనంగ
ముద్దులకొడుకుదయించినాండు తన- మొక్కుతీర్చికొనంగ

పండువంటి ముత్తయిదువ తనతో- పయనంబయి రాగా
వండుచు పాయసమాహులు వక్కలు- పాలును గొంతేగా
మూడుమాసముల మగబిడ్డనితో- ముదమునసే తెచ్చె
వేడుకొన్న భగవంతుడె యితడని- పేద్మ తోడగాంచె
తెచ్చినవన్నియు బుద్ధుని ముందఱ- దింపి చక్కగనిదె
అచ్చపు ప్రీతిగ మ్రొక్కుబడిని నీ- వారగింపుమనియె.

వ॥ అందుకు బుద్ధుడేమనుచున్నాడన.

— రగడ —

నేనును నీవలె మానవమాత్రుడ- నిజము నమ్ము తల్లీ
దేనికి దెచ్చితి విన్ని వస్తువులు- దెలుపుము గుణవల్లీ!

వ॥ అనియడుగ అయమ్మ జరిగిన దంతయు చెప్ప.

— రగడ —

నీవిశ్వాసమె నీకు దైవమై- నిన్ను బ్రోచెనమ్మ
పావనమగు మనభారతదేశపు- భాగ్యంబిది కొమ్మ.
పరమపతివ్రత! నీసంతానము- భాగ్యవంతమగును
వరుడు దేవుడని పూజలు సేయగ- వనితనీక తగును
అనుచు కొన్ని తిని ఆరగించెను- ఆనందముతోడ
తినుడని ఆ మెకు రామునకిచ్చెను- దీవనలను గూడ

వ॥ అంత ఆయమ్మ ప్రదక్షిణము చేసి నమస్కరించి వెళ్ళెను. బుద్ధుడు రాముని జూచి ఈ మంద నెక్కడికి తోలుకొని పోవుచున్నాడవని యడిగెను. అందులకు గొల్లవాడు,

—: బిందుసారుని యజ్ఞము :—

— రగడ —

బిందుసారుడొక యజ్ఞము సేయుచు- పిలువనంపినాడు
సంబరముగ గడుమంచి మేకలను- చంపదలచినాడు
ప్రభువుల ఆజ్ఞకు బద్ధుడనైనే- బయలు దేఱినాడ
శుభముగనే జనికోరిన వెల్లను- చూచియిచ్చువాడ

వ॥ అని చెప్పినంత ఆయజ్ఞమున జరుగు హింసను మాన్పవలయునని

బుద్ధుఁడు గొల్లనితో బయలుదేరె. అక్కడ మగధరాజు బింబ సారుఁడు జన్నము ప్రారంభింప-

— రగడ —

అజములతోడను రాముఁడు మెల్లఁగ- యజ్ఞశాలఁజేరె
సుజనులు మేఁకకుఁబొట్లు పెట్టఁగ- శోభలు మితిమీఱ
పసుపుఁ గుంకుముల నలంకరించిరి- పావనయూపమును
కుసుమాక్షతలం బూజించిరి శ్రుతి- గోపురదీపమును
సంభావనలకు వచ్చిరెందఱో- సద్బ్రాహ్మణవరులు
సంభావించిరి రాజుధర్మమును- సజ్జనులగువరులు
అగ్నిహోత్రునకు నృపుఁడు మంత్రమున- ఆజ్యమువడ్డించె
భగ్నంబయ్యెను పాపజాలమని- బాగుగ మదినెంచె
సమిధలు దర్భలు పూవులు ఫలములు- సవనసీమనుండె
క్రమముగ ఋత్విజతతి వేదంబుల- గానంబటనిండె
నవరంధ్రమ్ములు పూడ్తురు మేఁకకు- నానామంత్రముల
ప్రవిమల భక్తినివపదీయుదురిఁక- బహువిధ తంత్రముల
సవన పశువునిదె వధియించెదమను- సన్నాహము కలుగ
శివునివోలెఁ జనుదెంచెను బుద్ధుఁడు- చిత్తమెల్లఁగలఁగ

— గేయము —

వెదకరా నీలోన వెలుఁగొందుజ్యోతి
తుదముట్ట అజ్ఞాన దుఃఖదుర్నీతి
మానరా పరహింస మలినమౌబుద్ధి
రాణించు నీయంతరంగ సంశుద్ధి
మతభేదములతోడ మఱఁగి పోకండి
హితము కాదఁగు ముందుగతులు కానండి
సర్వమానవ సంఘ సౌఖ్య మెంచండి
నిర్వాణ మార్గాన నిలిచి చూడండి.

అని పాడుచువచ్చి-

ఉ॥ ఆఁగుము ఋత్విజా! నృపతి యజ్ఞమున ధనకాంక్షఁజేసి యీ
భాగముఁ జంపఁబూనితె విచారములేకిది పాపకృత్య మీ
నీగతి నోరులేని పశుహింసకుఁ బూనుట చూడఁజాలకే
యాగము నాఁపవచ్చితి యథార్థపథమ్మిఁకఁ బాఱఁజూడుమా.

వ॥ అని పలుక యజ్ఞము చేయుచున్న బ్రాహ్మణులకుఁ గోపమురా.

— రగడ —

వేదఋక్కులను ఋషులవాక్కులను- ద్వేషించెడివాఁడా
పాపము లేటికిఁ దొలఁగును మూఢా- పశులను మాపిత
రాజా యేటికి నూరకుండెదవు- రక్షింపుము క్రతువు
ఏజాతికి నేనెట్టి మాటవిన- ఎట్లుఅగును హితవు
జన్నఁబంతయుఁ బాడుసేయుటకుఁ- జనుదెంచినవాఁడు
కర్మిష్ఠ వీనిని బయటికిఁబంపుము- కావుమిద్దినేఁడు
పాషండుండని తెలియుచున్నది- పాపియుండఁదగఁడు
వేషముచూచిన ఋషిగానుండిన- పెగవినిఁ వెగఁడు

వ॥ అన బుద్ధుఁడు- ఆర్యా,

తే॥ మూఢవిశ్వాసములను నిర్మూనమ్ము
సేయుటది నాస్తికత్వమా సిగ్గుచేటు
రాసిలోఁ దాలుగింజలు తీసివేయ
సేవ్యకానిని నిందపాల్- సేయఁదగున

వ॥ అన శంకరభట్టు నీవుసేవ్యకాఁడవా యని ప్రశ్నింప నొసనుచు

మ॥ హలమాధర్మము- క్షేత్రమా మనసు- సద్వాక్యాలసత్కర్మము
కలుపుందీసెడియా యుధాలు- గుణసంఖ్యల్ బీజసందోహముల్
జలమా బోధ- అమోఘసేవ్యమెప్పుడున్ సాగించి నిర్వాణమున్
ఫలముంగూర్చెడి రైతురాజునని సంభావింపుమో ఋత్విజా!

వ॥ అన- రాజు

— రగడ —

అయ్యాయేటికి ఇట్టులాడెదవు- అరుగుము నీదారి
చయ్యనయజ్ఞము పూర్తిచేయవలె- చనుమిఁక జడదారి

వ॥ అన విని—

— రగడ —

ఏలయాగమును జేయుచుంటిరది- యెఱిఁగింపుము నాకు
వేలకొలఁది పశుహింసలు జరుగుట- వేడుకయా మీకు.

వ॥ అన రాజు పాపపరిహారమునకు- దేవారిష్టములు తొలఁగుటకు-
అగ్ని, ఇంద్రుఁడు, సోముఁడు మొదలగు దేవతలు తృప్తినొందుటకు-

అనిపలుకు ఈ సాధుజంతువును జంపిన దేవతలు సంతోషింతురా! ఆరగింతురా? ఆదరింతురా?

చ॥ ఎఱుఁగదు జీవహింస - పసులెవ్వరు కొట్టినఁ గంటనిప్పుకల్
చెఱుగదు - పచ్చిగడ్డిని చిక్కనిపాలనొసంగుఁ - జచ్చియుం
దొఱఁగదు మేలుసేఁత - ఒకదోసమెఱుంగని సాధుజంతు వి
ట్లువఁగ గొంతుగోయఁదగునా? నరజాతికి నీతియున్నదా?

వ॥ అని సర్వార్థసిద్ధుఁడనుగ బుత్రిజాని కన్నులు అగ్నికుండములై వెలుఁగ -

చాలుర చాలిఁకఁ దెలఁగుము ... ... సై
మేలగు రీతిగ మెలఁగుము
నాస్తిక బుద్ధిని విడుము
శాస్త్ర వేదము చూడుము
బలిపీఠంబును బాయుము
బలి యర్పించుట న్యాయము
యజ్ఞము పాడొనరించెదే
త్యజ్ఞను జూపుచు మించెదే
కర్తకు నీవిధి హానిరా
వర్తనమియ్యది మానరా

వ॥ రాజా ——

— ద్విపద —

హైందవాచారాల - నణఁచివేయంగ
సందేహపడకిట్లు - సాగినాఁడితఁడు
ఈ దుష్ప్రచారంబు - లీరీతిఁజేయు
ఈ దేశధర్మంబు - లింక మాఱునయ్య

వ॥ అన బుద్ధుఁడు శాంతముతో ——

— రగడ —

సర్వజీవులును దేవునిబిడ్డలు - శాంతముతోఁ జూడ
గర్వము మీఱఁగఁ జిన్నజంతువుల - ఖండింపకు చేత
చంపెడి వారలఁ జూచి వెచ్చఁదు - సర్వేశుండెప్పుడు
నింపుము నీదయ నందు హృదయమున - నేర్పు మీఱనిప్పుడు

ఎవఁడైనను నినుఁజంపవచ్చినపు- డెట్టులుండునిను
భువిపైఁ బాపులకట్టులుండునను- బుద్ధి వినుమఁయోను
కావున జీవులఁగరుణంజూడుము- కలదు మోక్షఫలము
పావన సత్యక్షేత్రమ్మునకది- బంగారపు హలము
అని సిద్ధార్థుఁడు పల్కినంతనే- అధిపుమనసు మారె
సునిశితమగు నవధర్మసూత్రిమెద- సున్నితముగ దూరె
వెంటనే బుద్ధునిపాదపద్మములు- వేడుకతోఁగనుచు
గెంటుము మాయజ్ఞానమ్మునిపతి- కేలుమొగిచి వినుచు
ఏవంశమ్ము పవిత్రమొనర్పఁగ- నిట్టు పుట్టినావు
పావనులౌ తలిదండ్రు లెవ్వరో- పలుకఁదగును మీరు
అని రాజడుగఁగ బుద్ధుఁడెంతయును- ఆనందముతోఁప
ఘనుఁడగు శాక్యనృపాలుని పుత్రుఁడ- గానెఱుఁగుము భూప
అనఁగనె సిద్ధార్థుండవు నీవ- అతిమోహము దేవ
జననీ జనకులు వెదకించిరి నిను- చయ్యనఁ జనలేవ
చిన్నతనమ్మున సన్యాసమ్మును- స్వీకరించితేల
అన్నులమిన్నను అర్ధాంగిని విడి- అడవికిఁ జనమేల
ఇచ్చెదరాజ్యము కన్యామణితో- ఏలుకొమ్ము దేవా
చెచ్చెర నీదరిఁజేరి యెప్పుడును- జేసెదనీసేవ

వ॥ అన-

ఉ॥ వీడితి రాజ్యభోగరతి- వీడితినత్సతి- తల్లిదండ్రులన్
వీడితి- బంధుమిత్రతతి వీడితి- కక్కినకూటి కాసయా
కూడదు- దేశదేశములకుంజని ధర్మముబోధసేయుచున్
బాడిదొలంగియున్న ప్రజ బాగొనరింపఁ దలంతు భూధవా

వ॥ మీవంటివారు నాయుద్యమమునకుఁ దోడ్పడిన సరగున సత్యాహింసలు సుప్రతిష్ఠములు కాఁగలవన రాజిల్లను-

చ॥ తెలియక తూలనాడితి సుధీవర! నీవచనామృతమ్ముచే
మొలకజనించె నాహృదయ మోక్షరసాంచిత భావబీజ సం
కలితమహాలవాలమునఁ గావున నన్నొక శిష్యరీతిగా
నలుపను జీవహింసగల జన్నములేనిఁక దైవసాక్షిగా.

బుద్ధుఁడు- బింబిసారుఁడు- సంవాదము

మాయామాళవ గౌళరాగము- దరువు ఆటతాళము

చెప్పుమా- శాక్యకులాబ్ధిసోమా- చెప్పుమా।
సర్వలోకమునిండి విశ్వంబెల్లనమృతముఁ దాన శాశ్వత
దివ్యతేజముతోడ వెల్గంగఁగలుగు నాత్మ జ్ఞానగరిమ ॥చెప్పు॥

బుద్ధుఁడు-
ఎఱుఁగుమా- సత్యము సార్వభౌమా- ఎఱుఁగుమా।
తనదులోపల తెలివితానఁగు తత్త్వమును దర్శించియోగము
మనసునిలిపిన మహిమ పెంచినయెఱుక బ్రహ్మంబంచుమదిలో
॥ఎఱుఁగు॥

బింబి-
ఎక్కడెక్కడి ప్రాణికోటులు- పెక్కు లెట్టులవచ్చి ధరకిం
కెక్కడీగతినుండి కడకే- దిక్కునకు విడిపోవనగునో ॥చెప్పుమా॥

బుద్ధుఁడు-
అద్దములలో నీడలంబలె- అఖిలజలముల భానుబింబము
ప్రతిఫలించిన రీతిగానిల- జీవసంతతివచ్చిపోవుట ॥ఎఱుఁగు॥

— రగడ —

అని బోధింపఁగ బుత్త్రిగ్వర్యుని- ఆత్మమహాత్మోఁగా
వినిపింపుండని యతఁడును వేఁడెను- వేడ్కకపడుకోనఁగా

వ॥ అపుడు శంకరభట్టను పురోహితుఁడు కోపా [illegible] బుత్త్రా! నీ యకరముడలములు నీకార్యకవు నాఁడవు [illegible] గల్గులు. తనులంబెట్టునా? నీవంటి వేవవండితుఁడు లేఁడనుకొంటిమి నీకుఁగూడ మతిమాలెనదా? ఇఁకఁబోయి నా స్త్రీకవతిములోఁ జేరుము నాకు మాత్రమిష్టము లేదని వెడలిపోయెను. ఆ దివ సమంతయు రాజాదులకు ధర్మోపదేశముచేసి మఱునాఁడు నా విడోక్కని వల్లెలఁ బట్టణముల దివ్యజ్ఞానమును బోధించుచు శిష్య బృందముతో మెఱుంగు వ్యాపమహర్షివలెఁ [illegible] కపిలవస్తు పురముసేరె. పదుసంవత్సరములవయస్సునందున్న [illegible] తన జనని వద్దఁజేఁ గూర్చుండి

: బుద్ధుని పురాగమనము :

— రగడ —

కడుపునకన్నము కంటికి నిద్రయుం- గఱవుగమనుచుండ
ఎడారినవిడలె యశోధరాసతి- ఎండిపోవుచుండ
కన్నతల్లి నివేల దిగులుతోం- గంటనీరుగార్చు
ఎన్ని దినంబులనుండి చూతునిది- ఎట్టులింకనోర్తు
అదియిది గోరిన తాతగారినే- అడుగుమిందు వేల
ముదమునం దండ్రిని గోరుమంచునీ- ముదల యీయవేల

చ॥ అడిగితినెన్ని మర్లొ బదులాడవు కారణమేమి యమ్మ! నీ
కొడుకునుగానొ- నాకు జనకుంగను భాగ్యములేదొ- తండ్రితోం
దొడపయిం జేర్చుకోందగు సుతుండనుగానొ- మఱేమి? యేటికే
విడుతువు కంటినీరు నినువేండెద సత్యమెఱుంగం జెప్పుమా

వ॥ అని యడుగుచుండ బ్రహ్మవర్చసము ముఖమునం దాండవమాడుచుండం దేజఃపరివేషమైన దివ్యమూర్తియై జటాకిరీట కాషాయాంబరధారియై భిక్షాపాత్రిచేం బూని సత్యజ్ఞాన ప్రబోధమొనర్చుచు శౌద్ధోదనివచ్చెనన్న వార్తవిని యుప్పట్టణంబు చంద్రోదయంబున నుప్పొంగు పాలసంద్రమయ్యె. అప్పుడు మంజువాణి యశోధరతో అమ్మా! చక్రవర్తి కాందగిన యువరాజులు ఎరివారికి చక్రవర్తియై మన పట్టనము ప్రవేశించిరట.

మ॥ మరళీ గానము విన్న తత్క్షణమనుగోవుల్ గోపికల్ గోపబా
లురు గోవుల్ హరిం జేరి తద్రస సుధాలోలత్వముం బూపుచున్
బరమానందము నెందురీతిం బ్రజసర్వజ్ఞ ప్రబోధామృతా
దరముం జూపుచుం జేరుచుందురటకాంతా! యెంతపుణ్యాత్ముండో

వ॥ అనుచుండ-

— రగడ —

చెన్నుండు బుద్ధునిరాక రాజునకుం- జెప్పెముదముతోడ
గ్రన్నన నంతఃపురమున నెల్లరు- కదలిరతనిం జూడ
అంతటభూపతి దశబలుడౌనెను- ఆనందమునిండ
చింతలంబాపెడి శ్రీహరియితండని- చెప్పకొనుచునుండ
పితృఋణమ్మును దీర్చువాండవని- ప్రేమించితి మున్ను

మాతృదేశమును నుద్ధరింతువిఁక- మఱవఁజాలనిన్ను
పాత్రమెత్తిఁగియిడు నీచేభిక్ష- పాత్రమందుకొనియె
చిత్రమ్మేమో నిన్నుఁజూడగనె- చింతలెల్లఁజనియె

వ॥ అడవిని సర్వజ్ఞుఁడా భిక్షాపాత్ర మహిమఁ జెప్పదలంచి

సీ॥ ఈపాత్రఁ గొనిగదా- ఈశుఁడు ప్రియమార
అన్నపూర్ణను బిచ్చ- మడిగికొనియె
ఈపాత్రఁ గొనిగదా- ఇందిరా సుందరీ
భర్త దానవలోక- భరనడిగె
ఈపాత్రఁ గొనిగదా- యెలమి మైవ్యాసుఁడు
పలిగూడుమ్మ్కాశిలోఁ- బొందఁగలిగె
ఈపాత్రఁ గొనిగదా- యేనాటికిని వటుల్
మాధుకరాన్నన మనుచునుంద్రు

తే॥ అట్టి యీపాత్ర యాత్మ కల్యాణ సూచ
కంబు కావునఁ గామనిష్కామములకుఁ
దారతమ్యము గమనించి- తత్త్వమెంచి
అనఘ! మోక్షామృతమ్ము నీవందుకొనుమ.

వ॥ అనఁ గిరీటమునకు మారు జటా జూటము- చంద్రహాసమునకు బదులు యోగదండము ధరించి ఛాత్రసమేతుఁడై సనకసనంద నాది దివ్యర్షి పరివృతుండగు దక్షిణామూర్తివలె వచ్చినాఁడని మెచ్చుకొనుచుండ-

కొడుకుఁదోడఁ జనుదెంచి యశోధర- దూర్చివిభునిగనియె
కడిగి పాదములు, పువ్వులుంచి తన- కనులకద్దుకొనియె
ఎన్ని కోర్కెలను కొండశిఖరము- ఎడఁదలోనకరఁగి
సన్నని జలరూపమ్మున వచ్చెనె. పతికన్నులఁదిరిగి
కాంతయశోధర పతిపాదమ్ములు కన్నీటనుగడిగె
కొంతసేపటికి మనసులోన కల- కోరికలేమిడిగె

వ॥ అంత నిరువురు కొంతసేపు మౌనముద్రవహించి యుండ నున్న రాహులుఁడు ఈయన మా నాయనాయని ప్రశ్నించ నౌను. నాయనాయనె. అందులకబ్బాలుఁడు ఇప్పుడు నాయనుగారో పాలుపోసితివే యన.

— రగడ —

చిరంజీవ యని రాహులు బుద్ధుండు- చేరదీసికొనియె
సంపాయమ్ముగ వర్తిల్లుదువని- నిండు ప్రేమ ననియె
శిరమునఁ బావలు చెన్నుమీఱఁగాఁ- జెన్నుండు చనుదెంచె
కరమును రాగముతోడ మహాత్ముండు- గాంచుచు దీవించె
ఆగపడలేదే కంటకమనజనుఁ- డాతఁడందుకొనియె
దిగులుతోడ మరణించెను గుఱ్ఱము- ధీవర వినుమనియె
జంతువులందును నెంతనీతిగల- జంతువిద్ది చెన్నా
ఇంతటిదానికి శాశ్వత సుగతిని- ఈశుఁడిచ్చు నన్నా
అనుచునుండఁగా దేవదత్తుండును- అపటికిఁ జనుదెంచి
తన యుష్ణీషము బుద్ధుని పదముల- దాపునందు నుంచి
తనశీర్షంబును సుగతుని యడుగుల- తాకునట్లు వంచె
ఘనపాపిని నన్గరుణఁ జూడుమని- కరములు జోడించె
అంగుళిమాలుండనియెడి దొంగయు- అత్తఱినే తెంచి
సంగరహితుండగు బుద్ధుని చెంగట- శస్త్రాస్త్రములుంచి
కోరికోరినే చేసినపాపము- కొండవోలెఁ బెరిఁగె
కారుణ్యంబున సుగతిఁ జూపుమని- కాళ్ళమీఁది కొరఁగె
నవయౌవనమునఁ గులస్త్రీతో- నందుఁడటకు వచ్చె
సవినయమతియని బుద్ధుండతనికి- జ్ఞానదీక్షయిచ్చె
అందఅనాథుఁడు దీవించుచుఁగడు- ఆదరమునఁ జూచె
అందఅకప్పుడు దివ్యభావతతి- ఆత్మలందుఁ దోఁచె
నేలయీనినటు మైదానమ్మున- నిండెను జనమెల్ల
పూలదోసిళులు పట్టియుంచిరి- బుద్ధునిపైఁ జల్ల
పొంగులువాఱెడి భక్తితోడజను- బోధనముల వినుచు
బంగరు బొమ్మలవోలె నిల్చిరి- పరమయోగిఁగనుచు
జీవహింసతోఁ గూడినపనులను- జేయవలదు మీరు
పావనమగు ఈ భారతధర్మము- ప్రపంచమే కోరు
మానవసేవయె స్వర్గమార్గమను- మాట మఱవవలదు
పూనిదానికై సర్వమొసంగినఁ- బుణ్యమెంతొ కలదు

వ॥ మహాశయులారా! లోకతత్త్వమును గ్రహించి యెదురీతకుఁ బ్రారంభించి దుఃఖ కారణములగు వేరుపురుగుల దొలఁగింపఁ దలంచితి. ఏ మతముగాని- ఏ తరిపాలనముగాని, అసత్యమునకు కవచముగ స్వార్థమునకుఁ బెట్టనికోటగ- అన్యాయమునకాలవాలముగఁ- బరరక్తాస్వాదనమునకు జలూకముగ- సాధుహింసకు ఖడ్గముగనుండరాదు. పైరులోఁ గలుపువోలె గుడ్డి నమ్మకము లద్దులేక పెరిగియున్నవి. వానిని నిర్మూలన మొనర్ప వలయు. తొలి బిడ్డను మ్రొక్కుబడియని గంగానదిలోఁ బాఱ వేయుట. భర్తృశవముతో బ్రతికియున్న భార్యను గూడఁగట్టి కాల్చివేయుట, కాళికాదేవికిఁ జక్కని బాలబాలికల బలి యొసంగుట యెంతటి క్రూరకృత్యములో యోచింపుఁడు. పరిశీలనము లేని జ్ఞానము వెలుఁగు లేని యింటివంటిది. బరమాత్మను దెలిసికొనఁగోరి యుపవాసాది వ్రతములచే శరీరమును శుష్కింపఁజేసితిని ఆఱు వత్సరములరణ్యములోఁ దపమాచరించితిని. కాని, అవాఙ్మానస గోచరుండగు పరమేశ్వరునిగూర్చి సర్వజనులకర్థమగునట్లు చెప్పఁజాలను. ఆత్మసాక్షాత్కారము తత్త్వపరులకే యసాధ్యముగనుండ నిఁక సామాన్య మానవులకెట్లర్థమగును. మాలిన్య రహితమగు నద్దమునందువలె నిష్కల్మష హృదయమున నీశ్వరగుణములు చక్కఁగఁ బ్రతిబింబించును. కావున మనుష్యుండు గుణములఁజక్కఁ బెట్టుకొనవలయును. స్వయంకృత కర్మానుసారముగ జీవికి సుఖదుఃఖములు గలుగుచుండును. సుఖమే స్వర్గము. దుఃఖమే నరకము. ఈ ధర్మచక్రమునందు లిఖింపఁబడిన యహింసాది చతుర్వింశతి ధర్మసూత్రములను నిత్యము జ్ఞప్తియుంచుకొనుఁడు.

— రగడ —

ఈ మార్గంబున నిచ్చలునడచిన- ఈశుఁడు దీవించు
ప్రేమజీవియెడఁ- జూపినదైవమె- ప్రియమునఁ బాలించు
గుణములన్నియును జక్కఁజేసికొన- గురుఁడే తానగును
దినదిన సాధనమున నరుఁడేతా- దివ్యపురుషుఁడగును

సర్వజగంబుల నిండివెలింగెడి- సర్వేశుఁడు మీకు
సర్వసుఖంబుల నిచ్చుచు దయతో- సతతము మిముఁ సాఁకు.

వ॥ అని ఆశీసములీను గుణవత్తుఁడు సర్వజ్ఞునకు నమస్కరించి ఆనంద- అశ్వజిత్- కౌండిన్య- మౌద్గల్యాయన- సారిపుత్రాది ప్రసిద్ధ శిష్య బృందముతో మీకు నన్ను నొసంగుటచే ధన్యుల మైతిమి. నూత్నఫల సంభరితమైన సప్త సముద్రములదాఁటి రేవు చేరిన నావవలె నుపన్యాసవేదిక నలంకరించితిరి. అమృతధార లొలుకు మీపలుకులు వినుటచే జ్ఞానజ్యోతి ప్రత్యక్షమైనదనఁ జెప్పుండందుకొని భోగమునకంటెఁ ద్యాగము గొప్పదని యెంచి రాజయోగమును ధిక్కరించి యోగరాజమును స్వీకరించి మోక్షద్వారకవాట పాటన మొనరించి దాని దారికిరమ్మని యాహ్వానించి యాదరించుచున్న ఓ అద్వయవాదీ! మీ చరణ రాజీవములకివే నమస్కారములని పౌరులంజూచి మహాజనులారా! ఏమహామహుని యుపన్యాస శబ్దతరంగములు దిక్చక్రపుటంచులకుఁ గొట్టుకొని ప్రతిధ్వనులిచ్చుచున్నవో, అద్యతనభావి నెవని చరిత్ర సువర్ణాక్షరములతో లిఖింపఁ బడనున్నదో అట్టి మహాత్ముఁడు తథాగతుఁడు ఇట ధర్మోపన్యాస మొసంగుట మనయదృష్టము. ఇమ్మహానుభావుని మహిమఁ దెలియ మన మెంతవారము.

సీ॥ అపరంజిరేకుల- నాహరించినవాఁడె
సంకటికొఱకు చేసాచినాఁడు
పసిఁడి జల్తారంచు- వలువ దాల్చినవాఁడె
కాషాయ వస్త్రముల్- గట్టినాఁడు
పువ్వుల పాన్పుపైఁ- బవ్వళించినవాఁడె
బండలమీఁదఁ బన్నుండినాఁడు
ఆరామ సౌధాల- నధివసించినవాఁడె
చిమ్మచీఁకటిగుహఁ- జేరినాఁడు.

తే॥ ఆమహా కష్టయువనిత- కావలిదెస
నెట్టి సౌఖ్యము దాఁగని పెట్టినాఁడొ

పూర్ణవిజ్ఞానమూర్తి ఈబుద్ధుఁడెఱుఁగుఁ
గాన మనుష్యులు తెలియఁగాఁ గలరె జగతి.

— రగడ —

అనుచునుండఁగనె పూవ్వులు చల్లిరి. అచటనున్న జనులు
ఘన పెన్నిధియే దొరకినట్టులం. తలఁచిరవని ఘనులు
హరికిఁ దొమ్మిదవ యవతారంబని - ఆడిరెల్లరపుడు
తొలఁగును పాపములు కథవిన్నను - తోష మొదవు నెపుడు
ధర్మం శరణం గచ్ఛామియని - ధన్యులాడుచుంటే
సంఘం శరణం గచ్ఛామియని - సాధులనుచునుండ
బుద్ధం శరణం గచ్ఛామియని - బుధులు పల్కుచుండ
చెంగటనిల్చిరి నీరాజనములు - చేతులరాజిల్ల
మంగళగీతము లాలపించిరి - మహిళామణులెల్ల
జయము జయము మన భారతమాతకు జయము దిగ్విజయము
జయము జయము మన భరతవీరులకు జయము దిగ్విజయము

గద్యము

ఇది శ్రీమద్గౌరీ శంకర వరప్రసాద లబ్ధ సహజ
చతుర్విధ కవితా కలా విలాస సాహితీరస వికాస
సంస్కృతాంధ్రాది బహుభాషా గభీరమనోహర
భావబంధుర మహోల్లాసభాస బండ్లపిచ్చమ్మా
పిచ్చయామాత్య పౌత్రి యాదమ్మా
వేంకట సుబ్బసూర్య జ్యేష్ఠ పుత్రి
యన్నపూర్ణా సావిత్రి కళత్రి
సుహృజ్జన విధేయ
సుబ్రహ్మణ్య నామధేయ
ప్రణీతంబైన
బుద్ధచరిత్ర
సర్వము
సంపూర్ణము.